www.aakshitha.com
People's voice
అక్షిత
జాతీయ దినపత్రిక
AKSHITHA NATIONAL DAILY
తెలంగాణ దిక్సూచి
ఆదివారం | 13 | సెప్టెంబర్ | 2026 | పేజీలు: 08





ప్రభుత్వానికి ఏళ్ల తరబడి సహకరిస్తూ కస్టమ్ మిల్లింగ్ రైస్ (సిఎంఆర్) అందిస్తున్న రైస్ మిల్లర్లు ప్రస్తుతం ఎదుర్కొంటున్న సమస్యలు తీవ్ర ఆర్థిక సంక్షోభానికి దారితీస్తున్నాయని నిర్మల్ జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ఆవేదన వ్యక్తం చేసింది. సివిల్ సప్లై శాఖ ఆధ్వర్యంలో జరుగుతున్న ఫిజికల్ వెరిఫికేషన్లు, తనిఖీలు,(సిఎంఆర్) డెలివరీలో జాప్యం, ఎఫ్‌సీఐలో నిల్వకు స్థలం కొరత, ఓటీఆర్/రికవరీ సమస్యలు, సోర్టెక్స్‌లో సహజంగా జరిగే బియ్యం నష్టం, విద్యుత్, కార్మిక, రవాణా, యంత్రాల నిర్వహణ ఖర్చులు భారీగా పెరగడంతో మిల్లింగ్ నిర్వహించడం భారంగా మారిందని పేర్కొంది.

# మిల్లింగ్‌కు బ్రేక్
# మిల్లర్లకు నష్టం!

**ఫిజికల్ వెరిఫికేషన్లు, ఎఫ్‌సీఐలో స్థలం లేక డెలివరీ ఆలస్యం**

**పెరిగిన విద్యుత్, కార్మిక, రవాణా ఖర్చులతో తీవ్ర ఆర్థిక భారం**

**ఓటీఆర్/రికవరీ నిబంధనలు వాస్తవ పరిస్థితులకు అనుగుణంగా మార్చాలి**

**రబీ ధాన్యానికి 100 శాతం బాయిల్డ్ రైస్ కోటా ఇవ్వాలని డిమాండ్**

**సమస్యలు పరిష్కరించే వరకు మిల్లింగ్, ప్రొడక్షన్ నిలిపివేత**

**జిల్లా కలెక్టర్ చొరవ చూపాలని నిర్మల్ జిల్లా రైస్ మిల్లర్ల విజ్ఞప్తి**





**లోకేశ్వరం, అక్షిత న్యూస్ :** ప్రభుత్వానికి ఏళ్ల తరబడి సహకరిస్తూ కస్టమ్ మిల్లింగ్ రైస్ (సిఎంఆర్) అందిస్తున్న రైస్ మిల్లర్లు ప్రస్తుతం ఎదుర్కొంటున్న సమస్యలు తీవ్ర ఆర్థిక సంక్షోభానికి దారితీస్తున్నా యని నిర్మల్ జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ఆవేదన వ్యక్తం చేసింది. సివిల్ సప్లై శాఖ ఆధ్వర్యంలో జరుగుతున్న ఫిజికల్ వెరిఫికేషన్లు, తనిఖీలు,(సిఎంఆర్) డెలివరీలో జాప్యం, ఎఫ్‌సీఐలో నిల్వకు స్థలం కొరత, ఓటీఆర్/రికవరీ సమస్యలు, సోర్టెక్స్‌లో సహజంగా జరిగే బియ్యం నష్టం, విద్యుత్, కార్మిక, రవాణా, యంత్రాల నిర్వహణ ఖర్చులు భారీగా పెరగడంతో ..మిగతా 2లో

# పటిష్టంగా సర్ ప్రక్రియ

**సర్ ప్రత్యేక ప్రచార దినోత్సవ కార్యక్రమాల పరిశీలన**



**మహబూబ్‌నగర్,అక్షిత న్యూస్:** మహబూబ్ నగర్ జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్, 75-జడ్చర్ల అసెంబ్లీ నియోజకవర్గం ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి జె.ఎల్.బి. హరిప్రియ శనివారం జడ్చర్ల మండలంలోని గంగాపూర్, గొల్లపల్లి గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. సర్ 2026లో భాగంగా నిర్వహిస్తున్న ప్రత్యేక ప్రచార దినోత్సవ కార్యక్రమాల సందర్భంగా గంగాపూర్ గ్రామం లోని పోలింగ్ కేంద్రాలు ..మిగతా 2లో

# ప్రతిభను చాటిన ఈశ్వర్ కుమార్



**సీఎస్ఐఆర్ యూజీసీ నెట్‌లో ఈశ్వర్ కుమార్‌కు జాతీయ స్థాయిలో 42వ ర్యాంకు**


2

**జాతీయ స్థాయిలో ఉత్తమ ర్యాంకు సాధించిన ఈశ్వర్ కుమార్‌కు కుటుంబ సభ్యులు అధ్యాపకులు మిత్రులు అభినందనల వెల్లువ**

# బోధన్‌లో పీడీఎస్ బియ్యం పట్టివేత...!

**523 బస్తాలతో లారీ సీజ్**

**మేడ్చల్ నుంచి బోధన్‌కు అక్రమ రవాణా...!**




**నిజామాబాద్, అక్షిత బ్యూరో:** బోధన్ పట్టణ పరిధిలో భారీగా పీడీఎస్ బియ్యం అక్రమ రవాణా వెలుగులోకి వచ్చింది. శుక్రవారం పెట్రోలింగ్ నిర్వహిస్తున్న పోలీసులు అనుమానాస్పదంగా బియ్యం లోడ్‌తో వెళ్తున్న టి ఎస్ 16 యూబి 3690 నంబర్ గల లారీని ఆపి తనిఖీ చేశారు. లారీలో 523 బస్తాల ..మిగతా 2లో



## అప్రకటిత కోతలతో
# రైతుల కంట తడి

**యర్కారం సబ్ స్టేషన్ ఎదుట రైతుల రాస్తారోకో**

**సూర్యాపేట, అక్షిత బ్యూరో :** సూర్యాపేట మండలంలో రైతులు కరెంట్ కోతలపై కన్నెర్ర చేశారు.పంటలకు అవసరమైన సమయంలో విద్యుత్ సరఫరా సక్రమంగా లేకపోవడంతో ఆగ్రహించిన రైతులు యర్కారం సబ్ స్టేషన్ ను ముట్టడించి, ప్రధాన రహదారిపై రాస్తారోకో నిర్వహించారు.దీంతో సూర్యాపేట-జనగాం రహదారిపై సుమారు 5 కిలోమీటర్ల మేర ట్రాఫిక్ నిలిచిపోయింది.

**అప్రకటిత కోతలతో పంటలు ఎండి పోతున్నాయ్....**

విద్యుత్ కోతల కారణంగా పంటలు ఎండి పోతున్నాయని రైతులు ఇప్పటికే అధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ సమస్య పరిష్కారం కాలేదని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేశారు. బోరు బావుల ..మిగతా 2లో

## పటిష్టంగా సర్ ప్రక్రియ



**మొదటి పేజీ తరువాయి...**

208, 209, 210, 211, గొల్లపల్లి గ్రామంలోని పోలింగ్ కేంద్రాలు 121, 122, 123లను ఆమె సందర్శించి, అక్కడ జరుగుతున్న కార్యక్రమాలను పరిశీలించారు. ఈ సందర్భంగా నోటీస్ హియరింగ్స్, డిస్క్రెపెన్సీస్, నో మ్యాపింగ్కు సంబంధించిన పత్రాలు, రికార్డులను పరిశీలించి, వాటి పరిష్కారానికి చేపడుతున్న చర్యలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రత్యేక ప్రచార దినోత్సవంలో భాగంగా చేపడుతున్న కార్యకలాపాలను ఎన్నికల నిబంధనల ప్రకారం సమర్థవంతంగా నిర్వహించాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో ఎలాంటి లోపాలకు తావులేకుండా ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలించి, అర్హులైన ప్రతి ఓటరుకు సంబంధించిన వివరాలు సక్రమంగా నమోదు అయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆమె సూచించారు.

ఈ కార్యక్రమంలో జడ్చర్ల తహశీల్దార్, ఏఈఆర్ఓ నర్సింగరావు, డిప్యూటీ తహశీల్దార్ (ఎన్నికలు), జడ్చర్ల తదితరులు పాల్గొన్నారు.

## అప్రకటిత కోతలతో రైతుల కంట తడి

**మొదటి పేజీ తరువాయి...**

క్రింద వేసిన పంటలను కూడా సాగు చేసుకోలేని పరిస్థితి నెలకొందని, మోటార్లు కాలిపోయి,ట్రాన్స్ ఫార్మర్లు పాడై నెలల తరబడి నిరీక్షించాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు.ఈ ఆందోళనకు బీఆర్ఎస్ నాయకుడు, సూర్యాపేట మాజీ జడ్పీటీసీ జీడి భిక్షం మద్దతు తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అడ్డగోలు హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల కంట తడి పెట్టించేందుకే అప్రకటిత కరెంటు కోతలను విధిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు.రైతులు ధాన్యం పండిస్తే ఎక్కడ కొనాల్సి వస్తుందోనని నీళ్ల ఇవ్వకుండా రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. ఎల్నినో ప్రభావంతో పదెకరాలు సాగు చేసే రైతులు కూడా తిండి గింజల కోసం ఎకరం కూడా సాగు చేయలేని పరిస్థితి దాపురించిందని అన్నారు. అందుకోసం ఇప్పటికైనా సీఎం రేవంత్ రెడ్డి,జిల్లా మంత్రులు స్పందించి సూర్యాపేట జిల్లాకు ఎంత కరెంటు అవసరమో అంత మేర సరఫరా చేయాలని డిమాండ్ చేశారు.

## బోధన్‌లో పీడీఎస్ బియ్యం పట్టివేత...!

**మొదటి పేజీ తరువాయి...**




బియ్యం ఉన్నట్లు గుర్తించారు. బియ్యానికి సంబంధించి డ్రైవర్ వద్ద ఎలాంటి అనుమతి పత్రాలు, రవాణా పత్రాలు లేకపోవడంతో పోలీసులు లారీని అదుపులోకి తీసుకున్నారు. అనంతరం లారీని సివిల్ సప్లై అధికారులకు అప్పగించగా, అధికారులు బియ్యాన్ని పరిశీలించి అవి పీడీఎస్ బియ్యంగా నిర్ధారించినట్లు తెలిపారు. పట్టుబడిన బియ్యం మొత్తం 250 క్వింటాళ్లకు పైగా ఉన్నట్లు అధికారులు పేర్కొన్నారు.

**ప్రాథమిక విచారణలో మేడ్చల్ నుంచి**

బోధన్‌కు పీడీఎస్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్నట్లు గుర్తించినట్లు అధికారులు తెలిపారు. ఈ అక్రమ రవాణా వెనుక ఎవరున్నారు? బియ్యం ఎక్కడి నుంచి సేకరించారు? బోధన్‌లో ఎక్కడికి తరలిస్తున్నారు? అనే కోణాల్లో దర్యాప్తు కొనసాగుతోంది.

సివిల్ సప్లై అధికారుల ఫిర్యాదు మేరకు లారీ డ్రైవర్‌తో పాటు సంబంధిత వ్యక్తులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు బోధన్ ఎస్‌హెచ్ఓ తెలిపారు.

**అక్రమ రవాణాపై పోలీసుల హెచ్చరిక**

పీడీఎస్ బియ్యాన్ని అక్రమంగా రవాణా చేసినా, నిల్వ చేసినా కఠినమైన చట్టపరమైన చర్యలు తప్పవని పోలీసులు హెచ్చరించారు. పేదలకు అందాల్సిన ప్రజా పంపిణీ బియ్యాన్ని అక్రమంగా తరలించే వారిపై నిఘా మరింత పెంచుతామని పోలీసులు స్పష్టం చేశారు.

# మిల్లింగ్‌కు బ్రేక్
# మిల్లర్లకు నష్టం!

**మొదటి పేజీ తరువాయి...**

మిల్లింగ్ నిర్వహించడం భారంగా మారిందని పేర్కొంది. రాష్ట్ర రైస్ మిల్లర్స్ సంఘం నిర్ణయం మేరకు ఈ సమస్యలకు పరిష్కారం లభించే వరకు సెప్టెంబర్ 10 నుంచి రైస్ మిల్లింగ్, ప్రొడక్షన్ కార్యకలాపాలను నిరవధికంగా నిలిపివేస్తున్నట్లు జిల్లా రైస్ మిల్లర్లు ప్రకటించారు. ఈ మేరకు నిర్మల్ జిల్లా కలెక్టర్‌కు సంఘం ప్రతినిధులు వినతిపత్రం అందజేసి, రాష్ట్ర ప్రభుత్వం సమస్యలపై సానుకూలంగా స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

**రికవరీ నిబంధనలతో ఇబ్బందులు**

ధాన్యం మిల్లింగ్ సమయంలో నూకలు, తేమ, సోర్టెక్స్‌లో తొలగించే గింజలు తదితర కారణాలతో సహజంగానే కొంత నష్టం జరుగుతుందని మిల్లర్లు చెబుతున్నారు. ఈ నష్టాన్ని పరిగణనలోకి తీసుకోకుండా అధిక రికవరీ లక్ష్యాలను నిర్దేశించడం వల్ల మిల్లర్లు అదనపు భారాన్ని భరించాల్సి వస్తోందని తెలిపారు. ప్రతి రకం ధాన్యానికి టెస్ట్ మిల్లింగ్ నిర్వహించి, వాస్తవంగా లభించే బియ్యం, నూకలు, సోర్టెక్స్ రిజెక్షన్ తదితరాలను పరిగణనలోకి తీసుకుని రికవరీ ప్రమాణాలను నిర్ణయించాలని కోరుతున్నారు.

**సోర్టెక్స్ నష్టాన్ని మిల్లర్లపై మోపొద్దు**

ప్రభుత్వానికి నాణ్యమైన బియ్యం అందించేందుకు సోర్టెక్స్ యంత్రాల ద్వారా రంగు మారిన, నల్లబడిన, దెబ్బతిన్న, నాణ్యత లేని





గింజలను తొలగించాల్సి ఉంటుందని మిల్లర్లు పేర్కొన్నారు. ఈ ప్రక్రియలో జరిగే సహజ నష్టాన్ని మిల్లర్లు నియంత్రించలేరని, కాబట్టి సోర్టెక్స్ నష్టాన్ని కూడా రికవరీలో పరిగణనలోకి తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

**ఎఫ్‌సీఐలో స్థలం లేకపోతే మిల్లర్ల తప్పేంటి?**

బియ్యాన్ని సిద్ధం చేసి డెలివరీకి ఉంచుతున్నప్పటికీ ఎఫ్‌సీఐలో స్థలం లేకపోవడం, ప్లేస్‌మెంట్ లభించకపోవడం వల్ల బియ్యాన్ని సమయానికి పంపలేకపోతున్నామని మిల్లర్లు తెలిపారు. మిల్లర్ల తప్పు లేకుండా డెలివరీ ఆలస్యం జరిగితే వారిపై పెనాల్టీలు, ఇతర చర్యలు తీసుకోకుండా వెసులుబాటు కల్పించాలని కోరుతున్నారు. ఎఫ్‌సీఐలో స్థలం కోసం ఎదురుచూస్తూ ధాన్యం, బియ్యం ఎక్కువకాలం మిల్లుల్లోనే నిల్వ ఉండాల్సి వస్తోందని, దీంతో నాణ్యత తగ్గడం, రంగు మారడం, తేమలో మార్పులు, పురుగు పట్టడం వంటి సమస్యలు తలెత్తుతున్నాయని తెలిపారు. ఇలాంటి నష్టాలకు మిల్లర్లను బాధ్యులను చేయడం సరికాదని స్పష్టం చేశారు.

**రబీ ధాన్యానికి 100 శాతం బాయిల్డ్ రైస్ ఇవ్వాలి**

రబీ సీజన్‌లో వచ్చే ధాన్యం స్వభావం, అధిక ఉష్ణోగ్రతలు, వాతావరణ పరిస్థితుల కారణంగా రా రైస్ మిల్లింగ్‌లో నూకలు అధికంగా వస్తున్నాయని మిల్లర్లు చెబుతున్నారు. ఫలితంగా నాణ్యత సమస్యలతో పాటు ఆర్థిక నష్టం కూడా ఎదురవుతోందన్నారు. అందువల్ల రబీ సీజన్‌కు కేటాయించే ధాన్యానికి 100 శాతం బాయిల్డ్ రైస్ కోటా ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు.

**పెరిగిన ఖర్చులు.. తగ్గిన మిల్లింగ్ ఆదాయం**

విద్యుత్, కార్మికులు, రవాణా, హ్యాండ్లింగ్, డ్రైయేజ్, యంత్రాల నిర్వహణ తదితర ఖర్చులు గణనీయంగా పెరిగాయని రైస్ మిల్లర్లు తెలిపారు. ముఖ్యంగా బాయిల్డ్ రైస్ మిల్లుల్లో విద్యుత్ వినియోగం అధికంగా ఉండటంతో నిర్వహణ ఖర్చులు మరింత పెరుగుతున్నాయని పేర్కొన్నారు. ప్రస్తుత వాస్తవ ఖర్చులను పరిగణనలోకి తీసుకుని మిల్లింగ్ చార్జీలను ప్రభుత్వం పునఃసమీక్షించాలని కోరారు. ఇతర రాష్ట్రాల్లో మిల్లింగ్, ప్రాసెసింగ్‌కు క్వింటాల్‌కు సుమారు రూ.130 నుంచి రూ.150 వరకు చార్జీలు లభిస్తున్నాయని, అదే స్థాయిలో తెలంగాణలోనూ మిల్లర్లకు మిల్లింగ్ చార్జీలు అందించాలని విజ్ఞప్తి చేశారు.

**మిల్లర్లపై తనిఖీలు వేధింపులు ఆపాలి**

మిల్లుల్లో జరుగుతున్న ఫిజికల్ వెరిఫికేషన్లు, తనిఖీల పేరుతో అధికారులు మిల్లర్లను ఇబ్బందులకు గురిచేస్తున్నారని సంఘం ఆరోపించింది. నిబంధనల అమలుకు తాము వ్యతిరేకం కాదని, అయితే మిల్లర్లు ఎదుర్కొంటున్న వాస్తవ పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని తనిఖీలు నిర్వహించాలని కోరింది. అధికారుల తనిఖీలు, ఒత్తిళ్లు, వేధింపుల కారణంగా మిల్లర్లలో తీవ్ర ఆందోళన నెలకొంటోందని పేర్కొంది.

**ప్రభుత్వం చొరవ చూపాలని విజ్ఞప్తి**

ప్రస్తుత సీజన్‌లో తమ వద్ద ఉన్న ధాన్యాన్ని పూర్తిగా ప్రభుత్వానికి డెలివరీ చేసిన తర్వాతే తదుపరి సీజన్‌కు ధాన్యం కేటాయించే విధంగా చర్యలు తీసుకోవాలని రైస్ మిల్లర్లు కోరారు. తమ సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం, జిల్లా యంత్రాంగం సానుభూతితో పరిశీలించి, వాస్తవ పరిస్థితులకు అనుగుణంగా నిర్ణయాలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. మిల్లర్ల సమస్యలను పరిష్కరించడంతో పాటు ఫిజికల్ వెరిఫికేషన్లు, డెలివరీ జాప్యాలు, రికవరీ నిబంధనలు, రబీ ధాన్యం, మిల్లింగ్ చార్జీలు వంటి అంశాలపై స్పష్టమైన నిర్ణయం తీసుకుని మిల్లింగ్ కార్యకలాపాలు సజావుగా కొనసాగేలా చర్యలు తీసుకోవాలని నిర్మల్ జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కోస్లి వెంకట్రావు, ప్రధాన కార్యదర్శి పిన్నపురెడ్డి కృష్ణారెడ్డి, కోశాధికారి గంప సుందీప్ కోరారు.

# ప్రతిభను చాటిన ఈశ్వర్ కుమార్

### సీఎస్ఐఆర్ యూజీసీ నెట్‌లో ఈశ్వర్ కుమార్‌కు జాతీయ స్థాయిలో 42వ ర్యాంకు

### జాతీయ స్థాయిలో ఉత్తమ ర్యాంకు సాధించిన ఈశ్వర్ కుమార్ కు కుటుంబ సభ్యులు అధ్యాపకులు మిత్రులు అభినందనల వెల్లువ

**కుత్బుల్లాపూర్, అక్షిత ప్రతినిధి :** సైబరాబాద్ కార్పొరేషన్ కుత్బుల్లాపూర్ జూన్ దుండిగల్ సర్కిల్ డి. పోచంపల్లి చంద్రశేఖర్ రెడ్డి నగర్ డాక్టర్ బస్తి నివాసితులైన అరికల రాజకుమార్ రామాంజన్ దంపతుల కుమారుడైన ఈశ్వర్ కుమార్ సి ఎస్ ఐ ఆర్ యూజీసి నెట్ లో ఈశ్వర్ కుమార్ కు జాతీయ స్థాయిలో 42వ ర్యాంకు రావడంతో కుటుంబ సభ్యులు మిత్రులు అభినందించారు ఈశ్వర్ కుమార్ విశ్వవిద్యాలయ నుంచి, జాతీయ పరీక్షల సంస్థ ఎన్ టిఏ నిర్వహించిన జాయింట్ సీఎస్ఐఆర్ యూజీసీ నెట్ సిసిఎస్ఐ ఆర్ యుజిఎస్ ఎన్ ఈ టి జూన్ 2026' ఫలితాల్లో నగరానికి చెందిన ఆరకల ఈశ్వర్ కుమార్ జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరిచారు. ఎర్త్, అట్మాస్ఫియరిక్, ఓషన్ అండ్ ప్లానెటరీ సైన్సెస్' విభాగంలో ఆయన ఆల్ ఇండియా 42వ ర్యాంకు సాధించి జూనియర్ రీసెర్చ్ ఫెలోషిప్ సి ఎస్ ఐ ఆర్ జే ఆర్ ఎఫ్ అసిస్టెంట్ ప్రొఫెసర్



అర్హతను దక్కించుకున్నారు.

ఈ పరీక్షలో ఈశ్వర్ కుమార్ 200 మార్కులకు గాను 138.400 మార్కులు 98.86 పర్సంటైల్) సాధించారు.

ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి జియాలజీలో పీజీ పూర్తి చేశారు. గతంలో డిగ్రీ స్థాయిలో ఉస్మానియా యూనివర్సిటీ గోల్డ్ మెడల్ సాధించడంతో పాటు, ప్రతిష్టాత్మక ఇస్రో ఎన్ ఆర్ ఎస్ సి సీఎస్ఐఆర్–ఎన్ఐఓ సి ఎస్ ఆర్ ఐ ఎన్ఐఓ వంటి సంస్థల్లో రీసెర్చ్ ఇంటర్న్‌గా పనిచేశారు. జాతీయ స్థాయిలో ఉత్తమ ర్యాంకు సాధించిన ఈశ్వర్ కుమార్ కు మిత్రులు కుటుంబ సభ్యులు అభినందించారు.

# తెలంగాణ రాష్ట్రంలో ఫసల్ భీమా వెంటనే అమలు చేయాలి

### ప్రభుత్వ వైఫల్యాలపై బీజేపీ రైతు ధర్నా

### కాంగ్రెస్ సర్కార్‌కు వ్యతిరేకంగా హోరెత్తిన నినాదాలు

### మహబూబ్ నగర్ పార్లమెంట్ సభ్యులు డీకే అరుణ




**వనపర్తి అక్షిత ప్రతినిధి :** తెలంగాణ రాష్టంలో ఫసల్ భీమా వెంటనే అమలు చేయాలని మహబూబ్ నగర్ పార్లమెంట్ సభ్యులు డీకే అరుణ పేర్కొన్నారు. శనివారం వనపర్తి జిల్లా కొత్తకోట మున్సిపాలిటీలో ప్రభుత్వ వైఫల్యాలపై బీజేపీ రైతు ధర్నా కార్యక్రమం చౌరస్తాలో నిర్వహించారు. కాంగ్రెస్ ప్రభుత్వ 1000 రోజుల పాలన వైఫల్యాలను నిరసిస్తూ భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో ప్రభుత్వ వైఫల్యాలపై రైతుల ధర్నా కార్యక్రమం ఉధృతంగా జరిగింది. పార్లమెంట్ సభ్యురాలు డీకే అరుణ మాట్లాడుతూ కాంగ్రెస్ ఇచ్చిన హామీలు నెరవేర్చలేదని మండిపడ్డారు. రుణమాఫీ చేయాలి రూ.2 లక్షల రుణమాఫీ పూర్తిగా అమలు చేయాలి, మిగిలిన రైతులకు వెంటనే రుణ విముక్తి కల్పించాలని డిమాండ్ చేశారు . పంట బీమా అమలు చేయాలి ప్రతి రైతుకు పంట బీమా వర్తింపజేయాలి, నష్టపోయిన రైతులకు పరిహారం ఇవ్వాలని సూచించారు. రైతు లేనిదే రాజ్యం లేదు ధాన్యానికి గిట్టుబాటు ధర, 12 గంటల ఉచిత కరెంటు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పాలనలో రైతు నడ్డి విరిగింది. హామీలు ఇచ్చి మోసం చేయడమే కాంగ్రెస్ నైజం. రైతు ఆత్మహత్యలు పెరిగాయి, పాలకులు పట్టించుకోవడం లేదు అని విమర్శించారు. ఎన్నికల ముందు ఇచ్చిన 6 గ్యారెంటీలు ఏమయ్యాయని ప్రశ్నించారు. హామీలు అమలు చేసే వరకు పోరాటం ఆగదని హెచ్చరించారు. రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలి, రైతులకు నాణ్యమైన ఎరువులు అందించాలని పేర్కొన్నారు. పండించిన ప్రతి ఎకరాకు సాగునీటిని అందించాలి, రైతులకు పూర్తి స్థాయిలో రైతు రుణమాఫీ చెయాలనీ డిమాండ్ చేశారు. శంకర సముద్రం కింద పంటలు సాగు చేస్తున్న రైతులకు సాగునీరు ఇవ్వకుండా కాంగ్రెస్ సర్కార్ నిర్లక్ష్యం చేస్తూ రైతులను ఇబ్బందులకు గురి చేస్తుందని మండిపడ్డారు. కరువు వల్ల ఇబ్బందులు పడుతున్న పశువులకు గడ్డి కేంద్రాలు ఏర్పాటు చెయాలనీ డిమాండ్ చేశారు. రైతు గోసను తెలంగాణలో రైతు రాజ్యం రావాలి అంటూ ప్లకార్డులు ప్రదర్శించారు. అనంతరం 7 వ వార్డులో హైమాస్ట్ లైట్స్ ను స్విచ్ ఆన్ చేసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు డోకూర్ పవన్ కుమార్ రెడ్డి, కొండా ప్రశాంత్ రెడ్డి, అయ్యగారి ప్రభాకర్ రెడ్డి, రాజవర్ధన్ రెడ్డి, బీజేపీ కిసాన్ జిల్లా అధ్యక్షులు దాబ శ్రీనివాస్ రెడ్డి, భరత్ భూషణ్, నర్సింహా, రాములు యాదవ్, బీజేపీ జిల్లా నాయకులు, రైతు మోర్చా సభ్యులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# హంటర్ రోడ్డులో ట్రాఫిక్ పోలీసుల ప్రత్యేక తనిఖీలు

### మైనర్ డ్రైవింగ్ కేసులు నమోదు

### కాజిపేట్ ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ పి వెంకన్న



**కాజిపేట్, అక్షిత ప్రతినిధి :** హనుమకొండ హంటర్ రోడ్ నందు ట్రాఫిక్ పోలీసులు ప్రత్యేక తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీలో శబ్ద కాలుష్యంతో వాహనాలు నడుపుతున్న మైనర్లు అయినంటువంటి ద్విచక్ర వాహనదారులను గుర్తించి చెక్ చేసి వారిపై మైనర్ డ్రైవింగ్ కేసులు బుక్ చేయడం జరిగింది అని ట్రాఫిక్ పోలీసులు తెలిపారు. అందులో భాగంగా రెండు ద్విచక్ర వాహనంలో మోడీఫైడ్ సైలెన్సర్ ఉన్నందున సౌండ్ పొల్యూషన్ కేసులు నమోదు చేశారు . దీనికి సంబందించి వాహనం నడిపిన మైనర్ల తల్లిదండ్రులను,పెద్దలను పిలిపించి కౌన్సిలింగ్ చేయడం జరిగింది. తల్లిదండ్రులు ఇకపై మైనర్లు అయిన తమ పిల్లలకు వాహనాలు ఇవ్వరాదని హెచ్చరించడం జరిగింది. అంతేకాకుండా గతంలో పట్టుబడిన (09)మంది మైనర్లను కోర్ట్ నందు ప్రవేశపెట్టగా కోర్ట్ వారికి (01) రోజు జువైనల్ హోమ్ కు పంపడం జరిగింది. అట్టి వాహన యజమానులకు జరిమానా విధించరు .

**పట్టణ ప్రజలకు కాజిపేట్ ట్రాఫిక్ పోలీస్ వారి విజ్ఞప్తి :**

తల్లిదండ్రులు తమ పిల్లలకు 18 సంవత్సరాలు నిండకుండానే డ్రైవింగ్ చేయుటకు వాహనాలను ఇవ్వరాదని అన్నారు. ఈ నిబంధనలు అతిక్రమిస్తే కేసులు పెట్టడం, తల్లిదండ్రులు,వాహన యజమానులను కూడా కోర్ట్ కు పిలిచి జరిమానా లేదా జైలుకు పంపించడం జరుగుతుంది అని స్పష్టం చేశారు. కాబట్టి ఇట్టి విషయాన్నీ గమనించి మైనర్లు అయిన పిల్లలకు వాహనాలను డ్రైవింగ్ చేయుటకు అనుమతించవద్దని ట్రాఫిక్ పోలీసులు హెచ్చరించారు.

# విషాద కుటుంబాలకు లోలం శ్యాంసుందర్ పరామర్శ...

### మృతుల కుటుంబాలకు అండగా ఉంటామని భరోసా...



**లోకేశ్వరం,సెప్టెంబర్ 12 అక్షిత న్యూస్ :** నిర్మల్ జిల్లా లోకేశ్వరం మండలంలో ఇటీవల వేర్వేరు ఘటనల్లో మృతి చెందిన వారి కుటుంబాలను బీఆర్ఎస్ ముధోల్ నియోజకవర్గ సమన్వయ కమిటీ సభ్యుడు,మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ లోలం శ్యాంసుందర్ శనివారం పరామర్శించారు.బాధిత కుటుంబ సభ్యులను ఓదార్చి, ప్రగాఢ సానుభూతి తెలిపారు. మండలంలోని మన్మద్ గ్రామానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు భోజన్న, ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు.విషయం తెలుసుకున్న లోలం శ్యాంసుందర్ ఆయన నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. భోజన్న అకాల మృతిపై దిగ్భ్రాంతి వ్యక్తం చేసి, కుటుంబ సభ్యులకు మనోధైర్యం కల్పించారు.

అనంతరం పూస్పూర్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త బండి సాయినాథ్ పెద్దమ్మ లస్మవ్వ, కండ్లీ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త మోహన్ తండ్రి బాపూరావు అనారోగ్యంతో మృతి చెందడంతో వారి కుటుంబాలను పరామర్శించారు. మృతుల చిత్రపటాల వద్ద నివాళులర్పించి, బాధిత కుటుంబాలకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల కన్వీనర్ కరిపే శ్యాంసుందర్, సర్పంచ్ వెంకటేష్, పీఏసీఎస్ మాజీ చైర్మన్ చిన్నారావు, మాజీ ఎంపీపీ సాగర్, మాజీ వైస్ ఎంపీపీ సాయన్న, మాజీ సర్పంచ్ దిగంబర్, బీఆర్ఎస్ సోషల్ మీడియా మండల కన్వీనర్ బండి ప్రశాంత్, నాయకులు చిన్న బోజారెడ్డి, సంటి రాజన్న, అనిల్, ప్రవీణ్, సందీప్, లక్ష్మణ్, బండి రాజు తదితరులు పాల్గొన్నారు...

# గంగారం గ్రామంలో బీఆర్ఎస్ వార్డు సభ్యురాలు కాంగ్రెస్‌లో చేరిక

### మహేశ్వరం నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే కేఎల్ఆర్ ఆధ్వర్యంలో



**మహేశ్వరం, అక్షిత ప్రతినిధి:** రంగారెడ్డి జిల్లా, మహేశ్వరం నియోజకవర్గ పరిధిలోని గంగారం గ్రామపంచాయతీకి చెందిన బీఆర్ఎస్ వార్డు సభ్యురాలు మునావత్ పద్మ దేవా కాంగ్రెస్ పార్టీలో చేరారు. మహేశ్వరం నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే కేఎల్ఆర్ ఆధ్వర్యంలో ఆమె కాంగ్రెస్ పార్టీ కండువా కప్పుకున్నారు. ఈ సందర్భంగా మునావత్ పద్మ దేవా మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి పథంలో ముందుకు సాగుతోందని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు తమను ఆకట్టుకున్నాయని తెలిపారు. ముఖ్యంగా గంగారం గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంతో పేద కుటుంబాల్లో సంతోషం నెలకొంటోందని పేర్కొన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులై కాంగ్రెస్ పార్టీలో చేరినట్లు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి, పేదల సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తోందని, రానున్న రోజుల్లో గంగారం గ్రామాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు పార్టీతో కలిసి పనిచేస్తామని ఆమె తెలిపారు. అనంతరం అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ జన్మదినాన్ని పురస్కరించుకుని ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గంగారం గ్రామ సర్పంచ్ దేవేందర్ నాయక్, ఉపసర్పంచ్ మహేందర్, వార్డు సభ్యులు ఎం. రవి నాయక్, ఎం. మోహన్, ఎం. దేవా, శ్రీనివాస్, ఎం. రాజా, ఎం. విజయ్, ఎం. జావర్, అలాగే తరుణ్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

# అశోక్ నగర్‌లో తీరిన తాగునీటి కష్టాలు



**కరీంనగర్ అక్షిత బ్యూరో:** నగరంలోని 54వ డివిజన్ అశోక్ నగర్ పరిధిలో నూతనంగా ఏర్పాటైన కాలనీలో నెలకొన్న తాగునీటి సమస్యకు పరిష్కారం లభించింది. కాలనీవాసుల తాగునీటి కష్టాలకు శాశ్వత పరిష్కారం చూపే లక్ష్యంతో ఏర్పాటు చేసిన నూతన బోరును శనివారం నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ ప్రారంభించారు.

కాలనీలో తీవ్రంగా నెలకొన్న నీటి ఎద్దడిని గుర్తించిన 54వ డివిజన్ కార్పొరేటర్ గొట్టిముక్కుల ఉమారాణి వెంకటరమణ ప్రత్యేక చొరవ తీసుకుని నూతన బోరును వేయించారు. బోరు ద్వారా నీటి సరఫరా నిరంతరంగా కొనసాగేందుకు అవసరమైన విద్యుత్ కనెక్షన్ కోసం కరెంటు మీటర్‌ను సైతం ఏర్పాటు చేయించారు.

ఈ సందర్భంగా మేయర్ కొలగాని శ్రీనివాస్ మాట్లాడుతూ.. ప్రజలకు మౌలిక వసతులు కల్పించడం, ముఖ్యంగా తాగునీటి సమస్యలను పరిష్కరించడం నగరపాలక సంస్థ ప్రధాన బాధ్యత అని అన్నారు. నగరంలోని ఏ ప్రాంతంలోనైనా తాగునీటి సమస్యలు ఉంటే వాటిని గుర్తించి తక్షణమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రజలకు సురక్షితమైన, నిరంతర తాగునీటి సరఫరా అందించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని పేర్కొన్నారు.ఏళ్లుగా ఎదుర్కొంటున్న తాగునీటి సమస్యకు నూతన బోరు ఏర్పాటుతో పరిష్కారం లభించడంతో కాలనీవాసులు హర్షం వ్యక్తం చేశారు. తమ సమస్యను గుర్తించి బోరు ఏర్పాటు చేయడంతో పాటు విద్యుత్ సౌకర్యం కల్పించేందుకు కృషి చేసిన మేయర్ కొలగాని శ్రీనివాస్, కార్పొరేటర్ గొట్టిముక్కల ఉమారాణి వెంకటరమణకు కాలనీ ప్రజలు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు కుమార్, రమేష్, అరుణ్, శ్రీనివాస్, గండి గణేష్ తదితరులతో పాటు పెద్ద సంఖ్యలో కాలనీవాసులు పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణకు మట్టి వినాయకులే మేలు....!



**నిజామాబాద్, అక్షిత బ్యూరో:** పర్యావరణ పరిరక్షణలో భాగంగా మట్టి వినాయక విగ్రహాల వినియోగాన్ని ప్రోత్సహిస్తూ నిజామాబాద్ నగరంలోని సాయి నగర్ కాలనీలో శనివారం ఉచితంగా మట్టి వినాయక విగ్రహాల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. మానవ హక్కుల ఻ నేర నిరోధక సంఘం జిల్లా సెక్రెటరీ పులగం మహేష్ కుమార్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. వినాయక చవితి సందర్భంగా పర్యావరణానికి హాని కలిగించే రసాయనాలు, ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో తయారు చేసిన విగ్రహాలకు బదులుగా సహజసిద్ధమైన మట్టితో తయారు చేసిన వినాయక విగ్రహాలను ప్రతిష్ఠించి పూజించడం ద్వారా పర్యావరణాన్ని కాపాడవచ్చని నిర్వాహకులు తెలిపారు. మట్టి విగ్రహాలు నీటిలో సులభంగా కలిసిపోవడంతో చెరువులు, కుంటలు, జల వనరుల కాలుష్యాన్ని తగ్గించేందుకు దోహదపడతాయని పేర్కొన్నారు. ప్రజల్లో పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించడంతో పాటు, ప్రతి ఒక్కరూ పర్యావరణహిత గణేష్ ఉత్సవాలను నిర్వహించాలనే ఉద్దేశంతో ఉచితంగా మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేస్తున్నట్లు పులగం మహేష్ కుమార్ తెలిపారు. భక్తి, సంప్రదాయంతో పాటు పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో పులగం రాములు, యశ్విన్, సాయికుమార్, కాలనీ వాసులు లక్ష్మణ్, జలంధర్ తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## జాతీయ లోక్ అదాలత్‌లో రాజీ మార్గమే రాజ మార్గం

**రాజీ పడదగిన కేసులను లోక్ అదాలత్ ద్వారా పరిష్కరించుకోవాలి: జిల్లా జడ్జి పి. నీరజ**




**రాజన్న సిరిసిల్ల జిల్లా:** రాజీ మార్గమే రాజ మార్గమని, రాజీ పడదగిన కేసులను కక్షిదారులు పరస్పర అంగీకారంతో పరిష్కరించుకుని తమ విలువైన సమయాన్ని, ధనాన్ని ఆదా చేసుకోవాలని రాజన్న సిరిసిల్ల జిల్లా జడ్జి పి. నీరజ సూచించారు. శనివారం రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు.

ఈ సందర్భంగా జిల్లా జడ్జి పి. నీరజ మాట్లాడుతూ.. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు రాజీ పడదగిన కేసులను లోక్ అదాలత్‌ల ద్వారా త్వరితగతిన పరిష్కరించుకునే అవకాశం ఉందన్నారు. న్యాయస్థానాల్లో కేసులు సుదీర్ఘకాలం కొనసాగడం వల్ల కక్షిదారులు సమయం, డబ్బు కోల్పోయే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. ఇరుపక్షాలు పరస్పర అంగీకారంతో రాజీ కుదుర్చుకోవడం ద్వారా కేసులను సులభంగా పరిష్కరించుకోవచ్చని తెలిపారు.

లోక్ అదాలత్‌ల ద్వారా కేసుల పరిష్కారంతో ఇరుపక్షాలకు న్యాయం జరగడంతో పాటు కోర్టులపై కేసుల భారం కూడా తగ్గుతుందని అన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని రాజీ పడదగిన కేసులను లోక్ అదాలత్ ద్వారా పరిష్కరించుకోవాలని పి. నీరజ కోరారు.

కక్షిదారులు తమ సమస్యలను న్యాయబద్ధంగా, పరస్పర అంగీకారంతో పరిష్కరించుకోవడానికి లోక్ అదాలత్ ఒక మంచి వేదికగా నిలుస్తుందని ఆమె తెలిపారు.


# ఈజీఎస్ నిధుల విడుదలలో జాప్యం.. రాజకీయ కక్షే కారణమా?

**పనులు పూర్తయి.. బిల్లులు మంజూరైనా చెల్లింపులు నిలిపివేశారని ఆరోపణలు**

**జిల్లా కలెక్టర్ మరియు డీపీవోకు మాజీ ఎమ్మెల్యే నారాయణరావు పటేల్ ఫిర్యాదు**



**నిర్మల్ అక్షిత బ్యూరో, సెప్టెంబర్ 12:** నిర్మల్ జిల్లా తానూర్ మండలం బొరిగాం-కె గ్రామ పంచాయతీలో ఈజీఎస్ (ఎంజీఎన్ఆర్ఈజీఎస్) నిధుల కింద చేపట్టిన శ్రీ మహదేవ్ మరియు వేంకటేశ్వరస్వామి దేవాలయం అభివృద్ధి పనులకు సంబంధించిన నిధుల విడుదలలో జాప్యం జరుగుతోందని మాజీ సర్పంచ్ బోదనపల్లి చంద్రకాంత్ యాదవ్ ఆరోపించారు. పనులు పూర్తిచేసి, బిల్లులు మంజూరైనప్పటికీ పంచాయతీ కార్యదర్శి, సర్పంచ్ సిహెచ్ సుధాకర్ వ్యవహరిస్తున్న తీరుతో చెల్లింపులు నిలిచిపోయాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో బొరిగాం-కె గ్రామంలో చంద్రకాంత్ యాదవ్ శ్రీ మహదేవ్



మరియు వేంకటేశ్వరస్వామి దేవాలయం పరిధిలో చేపట్టిన సీసీ రోడ్డు పనులకు సంబంధించి రూ.40 లక్షల విలువైన ఈజీఎస్ పనులు 2024--25 ఆర్థిక సంవత్సరంలో మంజూరయ్యాయని తెలిపారు. ఇందుకు సంబంధించిన బిల్లు ఎఫ్‌టీవో కూడా 2026 మే 28న జనరేట్ అయినప్పటికీ ఇప్పటివరకు తనకు చెల్లింపు జరగలేదని పేర్కొన్నారు. ఈ విషయమై పంచాయతీ కార్యాలయంతో పాటు సంబంధిత ఎంపీవో, ఎంపీడీవో, డీఎల్‌పీవో అధికారులను పలుమార్లు సంప్రదించినా సమస్య పరిష్కారం కాలేదని చంద్రకాంత్ యాదవ్ తెలిపారు. నిధులు మంజూరై, బిల్లు ప్రక్రియ పూర్తయిన తర్వాత కూడా చెల్లింపును నిలిపివేయడానికి సరైన అధికారిక కారణం తెలియజేయలేదని ఆరోపించారు. తనపై రాజకీయ కక్షతోనే నిధుల విడుదలను కావాలనే అడ్డుకుంటున్నారని చంద్రకాంత్ యాదవ్ ఆరోపించారు. అదే 24--2025 సమయంలో సుమారు రూ.9 లక్షల విలువైన ఈజీఎస్ పని చేసిన సర్పంచ్ సిహెచ్ సుధాకర్ కు అనుకూలంగా ఉన్న వ్యక్తికి నిధులు విడుదల చేసి, రాజకీయంగా ప్రత్యర్థి వర్గానికి చెందిన తన పనికి సంబంధించిన నిధులను మాత్రం నిలిపివేయడం వివక్షకు నిదర్శనమని ఆయన పేర్కొన్నారు. ఈ అంశంపై మాజీ ఎమ్మెల్యే, ముధోల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి భోస్లే నారాయణరావు పాటిల్ నిర్మల్ జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా,డీపీవో శ్రీనివాస్ కు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. మంజూరైన నిధులను వెంటనే విడుదల చేసి, చెల్లింపులో జరుగుతున్న జాప్యంపై సమగ్రంగా విచారణ జరిపించాలని అధికారులను కోరారు. అయితే, ఈ ఆరోపణలపై పంచాయతీ కార్యదర్శి, సర్పంచ్ సిహెచ్ సుధాకర్ వర్గం నుంచి అధికారిక వివరణ వెలువడాల్సి ఉంది. నిధుల విడుదలలో జాప్యానికి అసలు కారణాలపై సంబంధిత అధికారులు స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉందని గ్రామస్థులు అభిప్రాయపడుతున్నారు.

## దళిత జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలి

**వచ్చే నెల 7న దళిత జర్నలిస్టుల పోరం రాష్ట్ర మహాసభను విజయవంతం చెయ్యండి**

**దళిత జర్నలిస్టుల పోరం వ్యవస్థాపకులు కాశపోగు జాన్**

**కొత్తకోట ఎస్సై విక్రమ్ చేతుల మీదుగా వాల్ పోస్టర్ విడుదల**



**వనపర్తి అక్షిత ప్రతినిధి :** దళిత జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలని దళిత జర్నలిస్టుల పోరం వ్యవస్థాపకులు కాశపోగు జాన్ అన్నారు. వచ్చే నెల 07 వ తేదీన సంగారెడ్డి జిల్లా కేంద్రంలో దళిత జర్నలిస్టుల పోరం 11 వ రాష్ట్ర మహాసభను విజయవంతం చెయాలనీ పిలుపునిచ్చారు. శనివారం వనపర్తి జిల్లా కొత్తకోట పోలీస్ స్టేషన్లో ఎస్సై విక్రమ్, సెకండ్ ఎస్సై భాస్కర్ నాయుడు చేతుల మీదుగా వాల్ పోస్టర్ ను విడుదల చేశారు. ఈ సందర్బంగా వ్యవస్థాపకులు కాశపోగు జాన్ మాట్లాడుతూ ఉమ్మడి రాష్టంలో దళిత జర్నలిస్టులకు ప్రభుత్వం నుండి రావాల్సిన న్యాయమైన డిమాండ్స్ గురించి మేము పోరాడుతున్నామని తెలిపారు. అర్హులైన ప్రతి జర్నలిస్టుకు అక్రిడెషన్ కార్డులు మంజూరు చేయాలి, దళిత జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలతో పాటు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు కట్టించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. అర్హులైన జర్నలిస్టులకు హెల్త్ కార్డులు మంజూరు చేసి తక్షణమే అమల్లోకి తీసుకురావాలని కోరారు. దళిత జర్నలిస్టులకు అభయ హస్తం పథకం కింద సబ్సిడీ రుణాలు మంజురు చెయాలనీ డిమాండ్ చేశారు. అక్రిడెషన్ కమిటీలో దళిత జర్నలిస్టులకు అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. వచ్చే నెలలలో జరిగే మహాసభకు దళిత జర్నలిస్టుల సోదరులు పెద్ద ఎత్తుల హాజరు కావాలని పిలుపునిచ్చారు. ముందుగా ఎస్సై విక్రమ్ కు శాలువా కప్పి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వర్కింగ్ కార్యదర్శి ధనుష్, అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్, దళిత జర్నలిస్టుల పోరం లీగల్ అడ్వైజర్ మునగారి కృష్ణ, మాజీ కో ఆప్షన్ సభ్యులు మిషేక్, కాంగ్రెస్ పట్టణ మాజీ అధ్యక్షులు మేస్త్రి శ్రీను, సీనియర్ జర్నలిస్ట్ ఈశ్వర్, దిశ రమేష్, బాలరాజు, లక్ష్మణ్, దాసు తదితరులు ఉన్నారు.

## టిజెడబ్ల్యూఏ జాతీయ సలహాదారుగా డా. కొండ మల్లేశం గౌడ్.

**జర్నలిస్టుల హక్కులు, సంక్షేమం కోసం మరింత బలంగా గళం..**



**రామన్నపేట అక్షిత ప్రతినిధి:** తెలుగు జర్నలిస్ట్ వెల్ఫేర్ అసోసియేషన్ ( టి జె డబ్ల్యూ ఏ) జాతీయ సలహాదారుగా స్థానికం జాతీయ తెలుగు దినపత్రిక సీఈఓ, చీఫ్ ఎడిటర్ డా. కొండ మల్లేశం గౌడ్ నియమితులయ్యారు. జర్నలిస్టుల సంక్షేమం, వృత్తిపరమైన హక్కుల పరిరక్షణ, సమస్యల పరిష్కారం, ఐక్యత కోసం టిజెడబ్ల్యూఏ చేపడుతున్న కార్యక్రమాలకు ఆయన అనుభవం, సేవలు మరింత బలాన్నిస్తాయని సంఘం ప్రతినిధులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా శనివారం నాగోల్‌లోని స్థానికం జాతీయ తెలుగు దినపత్రిక కార్యాలయంలో డా. కొండ మల్లేశం గౌడ్‌ను టిజెడబ్ల్యూఏ జాతీయ జనరల్ సెక్రటరీ, సందేశం టైమ్స్ సీఈఓ షెట్టి వెంకటేష్ గౌడ్ మర్యాదపూర్వకంగా కలసి నియామకానికి సంబంధించిన ఐడీ కార్డు, ట్యాగ్‌ను అందజేశారు. ఈ సందర్భంగా షెట్టి వెంకటేష్ గౌడ్ మాట్లాడుతూ.. జర్నలిస్టుల హక్కులు, సంక్షేమం కోసం టిజెడబ్ల్యూఏ నిరంతరం కృషి చేస్తోందన్నారు. జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడంతో పాటు వృత్తిపరమైన భద్రత, గౌరవం, ఐక్యత కోసం సంఘాన్ని మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. జాతీయ సలహాదారుగా డా. కొండ మల్లేశం గౌడ్ అందించే సూచనలు, సహకారం సంఘానికి ఎంతో ఉపయోగపడతాయని ఆకాంక్షించారు. జర్నలిస్టుల సంక్షేమం, వృత్తి గౌరవం, హక్కుల పరిరక్షణే లక్ష్యంగా టిజెడబ్ల్యూఏ ను మరింత పటిష్టంగా ముందుకు తీసుకెళ్లేందుకు ప్రతి ఒక్కరి సహకారం అవసరమని ఆయన అన్నారు. డా. కొండ మల్లేశం గౌడ్‌కు టిజెడబ్ల్యూఏ జాతీయ సలహాదారు బాధ్యతలు అప్పగించడంపై పలువురు జర్నలిస్టులు, టిజెడబ్ల్యూఏ ప్రతినిధులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు.

# చిరస్మరణీయుడు కామ్రేడ్ సీతారాం ఏచూరి

## సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.బి. నర్సారెడ్డి



భద్రాచలం,అక్షిత న్యూస్: కమ్యూనిస్టు ఉద్యమానికి కామ్రేడ్ సీతారాం ఏచూరి అందించిన సేవలు చిరస్మరణీయమని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.బి. నర్సారెడ్డి అన్నారు. ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుతూ, దేశంలో లౌకిక, ప్రజాస్వామ్య విలువల పరిరక్షణకు కృషి చేసిన గొప్ప నాయకుడు ఏచూరి అని కొనియాడారు.

కామ్రేడ్ సీతారాం ఏచూరి రెండవ వర్ధంతి సభ భద్రాచలం పట్టణంలోని బండారు చంద్రరావు భవనంలో సీపీఎం పట్టణ కార్యదర్శి గడ్డం స్వామి అధ్యక్షతన నిర్వహించారు. ముందుగా సీతారాం ఏచూరి చిత్రపటానికి ఎం.బి. నర్సారెడ్డి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.

అనంతరం ఎం.బి. నర్సారెడ్డి మాట్లాడుతూ, విద్యార్థి దశ నుంచే ప్రజా ఉద్యమాలతో మమేకమైన సీతారాం ఏచూరి తన జీవితాన్ని కమ్యూనిస్టు సిద్ధాంతాలకు, కార్మికులు, కర్షకులు, పేదలు, సామాన్య ప్రజల హక్కుల సాధనకు అంకితం చేశారని అన్నారు. సీపీఎం కేంద్ర నాయకత్వంలో కీలక బాధ్యతలు నిర్వహిస్తూ పార్టీ నిర్మాణానికి, ప్రజా ఉద్యమాల బలోపేతానికి ఆయన విశేష కృషి చేశారని తెలిపారు.

దేశంలో మతతత్వ శక్తులు బలపడుతున్న సమయంలో లౌకికవాదాన్ని కాపాడేందుకు ఏచూరి ముందుండి పోరాడారని, ప్రజాస్వామ్య వ్యవస్థను పరిరక్షించేందుకు అన్ని ప్రజాస్వామ్య శక్తులను ఏకం చేయడంలో కీలక పాత్ర పోషించారని పేర్కొన్నారు. పార్లమెంటరీ రాజకీయాల్లోనూ ప్రజల గొంతుకగా నిలిచి, కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ఎప్పటికప్పుడు ప్రశ్నించారని అన్నారు.

కార్మికులు, రైతులు, వ్యవసాయ కూలీలు, మహిళలు, విద్యార్థులు, యువత ఎదుర్కొంటున్న సమస్యలపై ఆయన నిరంతరం పనిచేశారని అన్నారు. నేడు దేశంలో పెరిగిపోతున్న మతోన్మాద సామ్రాజ్యావాద విధానాలకు వ్యతిరేకంగా ఉద్యమాలను నిర్మించడమే సీతారాం ఇచ్చురికి మనమిచ్చే నిజమైన నివాళి అని నర్సారెడ్డి స్పష్ట చేశారు. సీతారామైచూరి స్ఫూర్తితో ప్రజా సమస్యలపై నిరంతరాయంగా కార్యకర్తలు పని చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐఎం గ్రామపంచాయతీ ఫ్లోర్ లీడర్ బండారు శరత్ బాబు పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు వారి సంతోష్ కుమార్ డి సీతాలక్ష్మి సీనియర్ నాయకులు బీబీజీ తిలక్ పట్టణ కమిటీ సభ్యులు నకిరేకంటి నాగరాజు కుంజా శ్రీను సన్న భూపేంద్ర ఎస్ఎఫ్ఐ నాయకులు రవీంద్ర డివైఎఫ్ఐ నాయకులు సతీష్ బాబు సిఐటి నాయకులు రామకృష్ణ ఐద్వా నాయకులు ఎం సుబ్బలక్ష్మి తదితరులు పాల్గొన్నారు

# అంగన్‌వాడీ కేంద్రాల్లో తల్లిపాల వారోత్సవాలు



చొప్పదండి అక్షిత న్యూస్: కరీంనగర్ జిల్లా చొప్పదండి మండలంలో అంగన్‌వాడీ కేంద్రాల్లో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు.అందులో భాగంగా మండల పరిధిలోని వెదురుగట్ట గ్రామంలోని స్థానిక రామలింగం పల్లి అంగన్‌వాడీ కేంద్రం లో తల్లిపాల వారోత్సవాలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఐసీడీఎస్ సిడిపిఓ నర్సింగరాణి ముఖ్య అతిధి గ హాజరైయ్యారు ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాలింతలు, గర్భవతులకు తల్లి పాల విశిష్టత గురించి వివరించారు. పుట్టిన శిశువుకు తల్లి ముర్రుపాలు పట్టించాలని సూచించారు. ముర్రుపాలు వల్ల శిశు వులో రోగ నిరోధక శక్తి పెరిగి ఆరోగ్యకరంగా ఉంటారని ఆమె పేర్కొన్నారు.తల్లి పాలు పిల్లలకు పట్టించడం వల్ల పిల్లలు ఆరోగ్యాంగా ఉంటారని సూచించారు గర్భిణీ మహిళలు అంగన్వాడీ ద్వారా పంపిణి చేసే పోషక పదార్థాలను తీసుకోవాలన్నారు .పిల్లలకు పాఠశాలకు వెళ్లే వయస్సు వచ్చే వరకు సమీపంలోని అంగన్వాడి కేంద్రానికి పంపించాలన్నారు .తదనంతరం గర్భిణీ మహిళలకు శ్రీమంతం తో పాటు చిన్నారులకు అన్నప్రసారణ చేసి స్వీట్స్ అందించారు ఈ కార్యక్రమంలో అంగన్వాడీ సూపర్వైజర్ మస్రత , గ్రామ సర్పంచ్ పెంచల శ్రీనివాస్ ఉప సర్పంచ్ మారం సమత, వార్డు సభ్యురాలు సుజాత అంగన్వాడీ కార్యకర్త గుల్లపెల్లి రమాదేవి తో పాటు గర్భిణీ మహిళలు చిన్నారుల తల్లులు పాల్గొన్నారు .

# వీరన్నపేట వాసుల 20 ఏళ్లకష్టాలకు శాశ్వత పరిష్కారం

## మేయర్ గుమ్మాల మమత శ్రీనివాస్ ముదిరాజ్



మహబూబ్ నగర్,అక్షిత న్యూస్: మహబూబ్‌నగర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని వీరన్నపేట సమీపంలో ఉన్న డంపింగ్ యార్డుతో గత 20 సంవత్సరాలుగా స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ దీర్ఘకాలిక సమస్యకు శాశ్వత పరిష్కారం దిశగా మహబూబ్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ గుమ్మాల మమత శ్రీనివాస్ ముదిరాజ్ డిప్యూటీ మేయర్ సురేందర్ రెడ్డి తో కలిసి కీలక నిర్ణయం తీసుకున్నారు. ఈ సందర్భంగా మన మహబూబ్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ గుమ్మాల మమత శ్రీనివాస్ ముదిరాజ్ మాట్లాడుతూ సమస్యను పూర్తిగా పరిష్కరించేందుకు 40 ఎకరాల స్థలాన్ని మహబూబ్ నగర్ లో సమకూరుస్తామని తెలిపారు. రానున్న నెల రోజుల్లో కార్పొరేషన్ కౌన్సిల్ సమావేశం నిర్వహించి భూమి కేటాయింపు, పనులను అధికారులతో చర్చించి పరిష్కరిస్తామని తెలిపారు. ప్రస్తుత డంపింగ్ యార్డును అక్కడి నుంచి తరలించి, కొత్త స్థలంలో అత్యాధునిక వేస్ట్ ట్రీట్మెంట్ ప్లాంట్‌ను ఏర్పాటు చేయడానికి ప్రణాళికను సిద్ధం అని తెలిపారు.

ఈ సందర్భంగా మేయర్ డిప్యూటీ మేయర్ స్వయంగా క్షేత్రస్థాయిలో డంపింగ్ యార్డును పరిశీలించి, త్వరలోనే ప్రజలకు దుర్వాసన మరియు కాలుష్యం నుంచి విముక్తి కల్పిస్తామని హామీ ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో పలు డివిజన్లకు కార్పొరేటర్లు కాంగ్రెస్ సీనియర్ నాయకులు కార్యకర్తలు మున్సిపల్ అధికారులు వార్డు సభ్యులు పాల్గొన్నారు.

# ఆవిష్కరణలకు వేదిక శ్రీ చైతన్య



ఖమ్మం /అక్షిత బ్యూరో : శ్రీ చైతన్య ఇన్స్టిట్యూట్ విద్యార్థుల ప్రతిభ విద్యార్థుల ఆలోచనా శక్తిని సాంకేతిక ఆవిష్కరణలుగా మలుస్తూ దేశంలోని వాస్తవ సమస్యలకు వినూత్న పరిష్కారాలను అన్వేషించే స్మార్ట్ ఇండియా హ్యాకథాన్--2026 కార్యక్రమం విద్యార్థుల్లో సృజనాత్మకతకు నూతనోత్సాహాన్ని ఈ జాతీయ స్థాయి వేదిక ద్వారా యువతలోని ప్రతిభను వెలికితీసి భవిష్యత్ ఆవిష్కర్తలుగా తీర్చిదిద్దే అవకాశం లభిస్తోందని శ్రీ చైతన్య ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ రీసెర్చ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ సాయి గీతిక అన్నారు.కళాశాల ప్రాంగణంలో నిర్వహించిన స్మార్ట్ ఇండియా హ్యాకథాన్--2026 పోటీల్లో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు పుస్తక జ్ఞానానికే పరిమితం కాకుండా సమాజం ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి వాటికి సాంకేతిక పరిజ్ఞానంతో పరిష్కారాలను రూపొందించడం అభినందనీయమన్నారు ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో సృజనాత్మక ఆలోచన పరిశోధనా దృక్పథం సమస్య పరిష్కార సామర్థ్యం నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తాయని పేర్కొన్నారు.

కళాశాల చైర్మన్ మల్లెంపాటి శ్రీధర్ మాట్లాడుతూ దేశంలోని వివిధ రంగాలకు సంబంధించిన వాస్తవ సమస్యలను సాంకేతిక పరిజ్ఞానంతో పరిష్కరించేందుకు స్మార్ట్ ఇండియా హ్యాకథాన్ గొప్ప వేదికగా నిలుస్తోందన్నారు. కళాశాలలో నిర్వహించిన అంతర్గత పోటీలకు విద్యార్థుల నుంచి విశేష స్పందన లభించిందని తెలిపారు. మొత్తం 78 జట్లు పోటీల్లో పాల్గొనగా ప్రతిభ ఆధారంగా 43 జట్లు జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు వెల్లడించారు.విద్యార్థులు తమ ఆలోచనలను కేవలం ప్రదర్శనలకే పరిమితం చేయకుండా వాటిని ఆచరణాత్మక పరిష్కారాలుగా అభివృద్ధి చేయడం ద్వారా సాంకేతిక రంగంలో తమ సామర్థ్యాన్ని నిరూపించుకున్నారని తెలిపారు.కళాశాల డీన్ డాక్టర్ వి సుదర్శన్ మాట్లాడుతూ విద్యార్థులు ఆలోచన నుంచి ప్రోటోటైప్ వరకు వెళ్లే దిశగా భారత విద్యా మంత్రిత్వ శాఖ ఏఐసిటీ ఈ మరియు ఇన్స్టిట్యూషన్స్ ఇన్నోవేషన్ కౌన్సిల్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న స్మార్ట్ ఇండియా హ్యాకథాన్ విద్యార్థులకు అనుభవాత్మక అభ్యాసానికి చక్కటి వేదికగా నిలుస్తోందన్నారు.

విద్యార్థులు బృందాలుగా ఏర్పడి సమస్యలను గుర్తించడం అవసరమైన సమాచారాన్ని సేకరించడం పరిశోధన చేయడం పరిష్కారాలను రూపొందించడం ప్రోటోటైప్ అభివృద్ధి కోడింగ్ టెస్టింగ్ వంటి దశలను పూర్తి చేస్తూ తమ ఆలోచనలకు ఆచరణాత్మక రూపం ఇస్తున్నారని తెలిపారు. ఈ ప్రక్రియ విద్యార్థుల్లో టీమ్ వర్క్తో పాటు సాంకేతిక నైపుణ్యాలను పెంపొందిస్తోందన్నారు.

కళాశాల రీసెర్చ్ కోఆర్డినేటర్ డాక్టర్ మురళీ మోహన్ మాట్లాడుతూ ఏఐ తో వినూత్న పరిష్కారాల రూపకల్పన ద్వారా విద్యార్థులు కృత్రిమ మేధస్సు (ఏఐ ) ఎలక్ట్రికల్ ఎలక్ట్రానిక్స్ మెకానికల్ మరియు సామాజిక సమస్యలకు సంబంధించిన పలు వినూత్న ప్రాజెక్టులను రూపొందించారని తెలిపారు.

డిసెంబర్లో నిర్వహించనున్న స్మార్ట్ ఇండియా హ్యాకథాన్--2026 గ్రాండ్ ఫినాలే లో విజేతలకు రూ.1.50 లక్షల నగదు బహుమతితో పాటు ప్రశంసాపత్రాలు అందజేయనున్నట్లు తెలిపారు. జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు మరింత ఉత్సాహంతో తమ ప్రాజెక్టులను మెరుగుపరుచుకుని విజయాన్ని సాధించాలని ఆకాంక్షించారు. విద్యార్థుల ఆలోచనలను ఆవిష్కరణలుగా మార్చే ఈ కార్యక్రమం ద్వారా ప్రాబ్లెమ్ ఐడెంటిఫికేషన్ రీసెర్చ్ ఇన్నోవేషన్ ప్రోటోటైపే టెస్టింగ్ సొల్యూషన్ అనే సమగ్ర ప్రక్రియను విద్యార్థులు అనుభవిస్తున్నారని నిర్వాహకులు తెలిపారు.ఈ కార్యక్రమంలో కళాశాల అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ వైశాలి ట్రైనింగ్ అండ్ ప్లేస్మెంట్ ఆఫీసర్ డాక్టర్ రాజేష్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ రాంబాబు వివిధ విభాగాల అధిపతులు అధ్యాపకులు రీసెర్చ్ కోఆర్డినేటర్స్ మెంటర్లు విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## వినాయక నిమజ్జనాలను ప్రశాంతంగా నిర్వహించుకోవాలి

**శామీర్ పేట్, దేవరయాంజాల్, పోతాయిపల్లి చెరువుల పరిశీలన**

**నిమజ్జన ఏర్పాట్లపై అధికారులతో మల్కాజిగిరి జోనల్ కమిషనర్ సమీక్ష**



**మేడ్చల్, అక్షిత ప్రతినిధి:** వినాయక చవితి సందర్భంగా శామీర్‌పేట్ పెద్ద చెరువులో నిర్వహించనున్న వినాయక విగ్రహాల నిమజ్జన కార్యక్రమాన్ని ప్రశాంతంగా, సజావుగా నిర్వహించేందుకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని అధికారులు, ప్రజాప్రతినిధులు సూచించారు. ఈ మేరకు మల్కాజిగిరి జోనల్ కమిషనర్ సంచిత్ గంగావర్, కీసర డిప్యూటీ కమిషనర్ రామలింగం, జిల్లా ఆర్టీఏ మెంబర్ భీమిడి జైపాల్ రెడ్డి, ట్రాఫిక్ సీఐ పవన్ కుమార్ రెడ్డితో పాటు సంబంధిత శాఖల అధికారులు శామీర్‌పేట్ పెద్ద చెరువును పరిశీలించారు. అదేవిధంగా దేవరయాంజాల్, పోతాయిపల్లి చెరువులను కూడా అధికారులు, ప్రజాప్రతినిధులు పరిశీలించి, ఆయా ప్రాంతాల్లో నిమజ్జనానికి అవసరమైన ఏర్పాట్లపై అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా నిమజ్జన ప్రాంతం, పరిసర ప్రాంతాలను సందర్శించిన అధికారులు, నిమజ్జన కార్యక్రమానికి సంబంధించి చేపట్టాల్సిన ఏర్పాట్లపై సంబంధిత శాఖల అధికారులతో సమీక్షించారు. పెద్ద సంఖ్యలో భక్తులు, ప్రజలు తరలివచ్చే అవకాశం ఉన్నందున ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు ప్రణాళికతో ఏర్పాట్లు పూర్తి చేయాలని సూచించారు. ప్రత్యేకంగా నిమజ్జన ప్రాంతంలో భద్రతా చర్యలను పటిష్టం చేయాలని, ప్రజల రాకపోకలకు అనుగుణంగా ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపట్టాలని సూచించారు. నిమజ్జన ప్రదేశంలో అవసరమైన క్రేన్లు, బారికేడ్లు, లైటింగ్, తాగునీటి సౌకర్యం, పారిశుద్ధ్య ఏర్పాట్లు అందుబాటులో ఉండేలా చూడాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఈ మాధవ చారి, ఏఈ నీరీషా రెడ్డి, సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మత్తుతో కాదు.. భక్తితో పూజిద్దాం

**రామన్నపేట సిఐ మోలుగూరి రవి**



**వలిగొండ/అక్షిత న్యూస్:** వినాయకుడిని మత్తుతో కాదు భక్తితో పూజించాలని, పండుగను బాధ్యతతో జరుపుకోవాలని రామన్నపేట సిఐ మొలుగూరి రవి అన్నారు. శనివారం రోజున వలిగొండ మండల కేంద్రంలో డీజీపీ ఆదేశాల మేరకు ఎస్సై శ్రీకాంత్ రెడ్డి ఆధ్వర్యంలో దేవిశ్రీ గార్డెన్ ఉత్సవాల నిర్వాహకులు, ప్రజాప్రతినిధులు, ఆయా పార్టీల నాయకుల తో వినాయక విగ్రహాల ప్రతిష్ఠాపన, ఊరేగింపు, నిమజ్జనం, ట్రాఫిక్ నియంత్రణ, విద్యుత్ వినియోగం, పర్యావరణ పరిరక్షణ వంటి అంశాలపై అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ మట్టి వినాయకులను వినియోగించి పర్యావరణ పరిరక్ష ణకు సహకరించాని కోరారు. నిమజ్జన సమయంలో నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు. గణేష్ నవరాత్రుల్లో భాగంగా డీజే ఆపరేటర్స్ పోలీసు నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని, వినాయక మండపాల వద్ద శోభాయాత్రలు నిమజ్జన సమయాల్లో డీజేలను వినియోగించవద్దనీ, ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో వినాయక ఉత్సవ కమిటీ సభ్యులు, ఆయా పార్టీల ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు

# కోయకుండానే కంట తడి పెట్టిస్తున్న ఉల్లి ఘాటు



**కరీంనగర్ జిల్లాలో కిలో ఉల్లి 80.. రూపాయలు**

**కరీంనగర్ అక్షిత బ్యూరో:** ఉల్లి లేనిదే వంట పూర్తి కాదంటే అతి శ్రేయోక్తి కాదు .పేద మధ్యతరగతి కుటుంబాల నుంచి హోటళ్లు రెస్టారెంట్స్ చిరు వ్యాపారుల వరకు ప్రతి నిత్యం ఉపయోగించే ముఖ్యమైన కూరగాయల్లో ఉల్లికి ప్రత్యేక స్థానం ఉంది. అలాంటి ఉల్లి ధర ఒక్కసారిగా పెరుగుతుండడం తో సామాన్యుడి వంటింటి బడ్జెట్ పై భారం పెరుగుతుంది ,ఇప్పటికే నిత్యా అవసర వస్తువుల తో ఇబ్బందులు పడుతున్న ప్రజలకు ఉల్లి ధర పెరుగు ధర మరింత ఆందోళన కలిగిస్తుంది .స్థానిక కరీంనగర్ మార్కెట్ లో ఉల్లి ధర కిలో 80 రూపాయలకు చేరుకుంది ,రానున్న రెండు మూడు రోజుల్లో కిలో ఉల్లి ధర వందకు చేరే అవకాశం ఉన్నట్లు వ్యాపారస్తులు చెబుతున్నారు .దింతో వినియోగదారుల్లో ఆందోళన మొదలైంది .కరీంనగర్ మార్కెట్ కు ఆంధ్రప్రదేశ్ ,కర్ణాటక ,మహారాష్ట్ర నుంచి రోజుకు సుమారు 25 నుండి 30 టన్నుల ఉల్లి దిగుమతి అవుతున్నట్లు అంచనా ,ఇంత పెద్ద మొత్తం లో సరఫరా ఉన్నప్పటికీ ధరలు పెరగడం ఏంటని వినియోగస్థులు ప్రశ్నిస్తున్నారు .మార్కెట్ లో ఉల్లి నిల్వల సరఫరా ,విక్రయా ధరలపై అధికారులు నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు .ఇదిలా ఉంటె కొందరు హోల్సేల్ వ్యాపారస్తులు ఉల్లి ని పెద్ద మొత్తం లో నిల్వలు చేసి ధరలు పెరిగిన అనంతరం అధిక ధరలకు విక్రయిస్తున్నారనే ఆరోపణలు వినవస్తున్నాయి .కృత్తిమ కొరత సృష్టించడం ద్వారా ధరలు పెరుగుతున్నయా అనే అనుమానం కూడా ;వినియోగ దారుల్లో వ్యక్తం అవుతుంది .హోల్ సెల్ మార్కెట్ లో సంబంధిత అధికారులు తనిఖీలు నిర్వహించి నిల్వలు ,కొనుగోలు ధరలు ,విక్రయ ధరలను పరిశీలించాలని ప్రజలు కోరుతున్నారు . పెరిగిన ధరల నుండి వినియోగదారులకు ఉపశమనం కల్గించేందుకు రైతు బజారులల్లో తక్కువ ధరకు ఉల్లిని అందుబాటులోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు .అవసరం అయితే ప్రభుత్వం సబ్సిడీ పై ఉల్లిని విక్రయించే ఏర్పాట్లు చేయాలనీ సూచిస్తున్నట్లు సమాచారం .ఇతర రాష్ట్రాల నుండి సరఫరా ను మరింత పెంచడం తో పాటు అక్రమ నిల్వలకు అడ్డుకట్ట వేస్తే ధరలను అదుపులోకి తీసుకు రావచ్చుని పేర్కొంటున్నారు ఉల్లి ధర 100రూపాయలకు చేరక ముందే సంబంధిత అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని వినియోగదాలు కోరుతున్నారు . నిత్యావస ధరల నియంత్రణ పై ప్రత్యేక దృష్టి సారించి సామాన్యుడి పై పడుతున్న అదనపు ఆర్థిక భారాన్ని తగ్గించాలని ప్రజలు కోరుతున్నారు.

# డ్రైవర్లు, క్లీనర్లకు శుభవార్త.. ఉచిత బీమాతో ఆర్థిక భరోసా

**నెక్కొండ ఇండియన్ ఆయిల్ బంక్ ఆధ్వర్యంలో అద్భుత అవకాశం**

**ఆసుపత్రి ఖర్చుల కోసం తక్షణమే రూ.2 లక్షల వరకు క్లెయిమ్ సదుపాయం ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ప్రొప్రైటర్ బాలకృష్ణ పిలుపు**



**నర్సంపేట అక్షిత ప్రతినిధి :** రాత్రింబవళ్లు రోడ్లపై శ్రమిస్తూ రవాణా రంగాన్ని పరుగులు పెట్టిస్తున్న హెవీ మోటార్ వాహనాల డ్రైవర్లు, క్లీనర్ల సంక్షేమమే లక్ష్యంగా నెక్కొండలోని ఇండియన్ ఆయిల్ బంక్ ఒక బృహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఆర్థికంగా వెనుకబడి ఉండే డ్రైవర్లు, క్లీనర్ల కుటుంబాలకు కొండంత అండగా నిలిచేందుకు.. తమ బంకులో డీజిల్ కొట్టించే వాహనదారుల కోసం 'ఎక్స్‌ట్రా పవర్ ఫ్లీట్ కార్డ్' ద్వారా ఏకంగా రూ. 5 లక్షల వరకు ఉచిత బీమా (ఇన్సూరెన్స్) కల్పిస్తున్నట్లు బంక్ ప్రొప్రైటర్ యాసం బాలకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు.



కుటుంబాల కోసం అలుపెరగకుండా కష్టపడే డ్రైవర్‌తో పాటు క్లీనర్‌కు కూడా ఈ ఉచిత భద్రత వర్తించడం విశేషం. ప్రయాణాల్లో అనుకోకుండా ఏదైనా ప్రమాదం జరిగితే.. ఆసుపత్రి ఖర్చుల కోసం గానీ, ఇతర వైద్య అవసరాలకు గానీ వెంటనే రూ. 2 లక్షల వరకు క్లెయిమ్ చేసుకునే గొప్ప సదుపాయం ఈ ఫ్లీట్ కార్డు ద్వారా అందుబాటులో ఉంచారు. దీనివల్ల అత్యవసర సమయాల్లో చేతిలో డబ్బుల్లేకపోయినా మెరుగైన వైద్యం పొందే అవకాశం ఉంటుంది.

బీమాతో పాటు డీజిల్ కొట్టించిన ప్రతిసారీ అదనపు రివార్డ్ పాయింట్లు కూడా ఖాతాలో జమవుతాయని నిర్వాహకులు తెలిపారు. ఎంతో మంది పేద కార్మికులకు ఆరోగ్య, ఆర్థిక భద్రతను అందించే ఉద్దేశంతో తీసుకొచ్చిన ఈ అద్భుతమైన అవకాశాన్ని హెవీ వాహనాలు నడిపే ప్రతి డ్రైవర్, యజమానులు వెంటనే వినియోగించుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు నెక్కొండలోని చల్లా గోడౌన్స్ ఎదురుగా ఉన్న ఇండియన్ ఆయిల్ బంక్‌లో కానీ, లేదా 8897759050 ఫోన్ నంబర్‌లో కానీ సంప్రదించి ఈ ఉచిత ఇన్సూరెన్స్ సౌకర్యాన్ని పొందవచ్చు.

www.aakshitha.com
People's voice
అక్షిత
AKSHITHA NATIONAL DAILY



# రాజీ మార్గమే రాజ మార్గం

**రాజీ పడడానికి అవకాశం ఉన్న అన్ని కేసుల్లో రాజీ పడవచ్చు**

**జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ నాగరాజు**

**జిల్లా కోర్టులోని న్యాయ సేవా సదన్‌లో 3వ జాతీయ లోక్ అదాలత్ ను ప్రారంభించిన జిల్లా ప్రధాన న్యాయమూర్తి**




ఖమ్మం /అక్షిత బ్యూరో : రాజీ మార్గమే రాజ మార్గమని రాజీ పడదగ్గ కేసులలో రాజీ పడి సత్వర న్యాయం పొందాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ ఎం నాగరాజు తెలుపారు. జాతీయ న్యాయ సేవా అధికార సంస్థ రాష్ట్ర న్యాయ సేవా అధికార సంస్థల ఆదేశాల మేరకు ఖమ్మం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో 3వ జాతీయ లోక్ అదాలత్‌ను శనివారం ఖమ్మం న్యాయ సేవా సదన్‌లో జిల్లా ప్రధాన న్యాయమూర్తి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ ఎం. నాగరాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ మాట్లాడుతూ

ఖమ్మం జిల్లాలో 15 లోక్ అదాలత్ బెంచ్‌ల ఏర్పాటు చేసినట్లు ఇందులో ఖమ్మం హెడ్ క్వార్టర్ లో 9 సత్తుపల్లిలో 3 మధిరలో 3 బెంచ్ లు ఉన్నాయని అన్నారు. ప్రజలకు వేగంగా సమర్థవంతంగా న్యాయం అందించేందుకు వీటిని ఏర్పాటుచేశామన్నారు. సివిల్ కేసులు కాంపౌండబుల్ క్రిమినల్ కేసులు మోటార్ వాహన ప్రమాద పరిహార కేసులు బ్యాంక్ రికవరీ కేసులు చెక్ బౌన్స్ కేసులు కుటుంబ/వైవాహిక వివాదాలు ప్రీ-లిటిగేషన్ కేసులు వినియోగదారుల వివాదాలు రాజీపడదగ్గ కేసులన్నీ లోక్ అదాలత్ లో పరిష్కారం అవుతాయన్నారు.

ప్రాచీన కాలం నుంచే మన సంస్కృతిలో సామరస్య పరిష్కార వ్యవస్థలు ఉన్నాయని లోక్ అదాలత్ అనేది వివాదాలను త్వరగా తక్కువ ఖర్చుతో ముగించే సరళమైన మార్గమని తెలిపారు. కోర్టు ఫీజులు చెల్లించి ఉంటే వాటిని సంబంధిత పక్షాలకు తిరిగి చెల్లిస్తారని లోక్ అదాలత్ ఇచ్చే తీర్పు సివిల్ కోర్టు డిక్రీతో సమానమైన చట్టబద్ధత కలిగి ఉంటుందని అన్నారు. లోక్ అదాలత్ ద్వారా సమయం ధనం ఆదా అవుతుందని కోర్టుల చుట్టూ తిరిగే శ్రమ తగ్గడమే కాకుండా కక్షలు-కార్పణ్యాలు లేకుండా రెండు పక్షాలకూ విన్-విన్ ఫలితం లభిస్తుందని ప్రధాన న్యాయమూర్తి తెలిపారు.ఇరుపక్షాల అంగీకారంతో తీర్పు వెలువడటం వల్ల మళ్లీ ఉన్నత కోర్టుల్లో అప్పీలు చేసుకునే అవసరం ఉండదని జిల్లా ప్రధాన న్యాయమూర్తి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ అన్నారు. గతంలో నిర్వహించిన లోక్ అదాలత్‌లలో ఖమ్మం జిల్లా న్యాయశాఖ పోలీసు విభాగం న్యాయవాదుల సహకారంతో తెలంగాణ రాష్ట్రంలోనే 5 వ ర్యాంకు సాధించిందని గుర్తుచేశారు. హైదరాబాద్ రంగారెడ్డి మేడ్చల్ వంటి మెట్రోపాలిటన్ ప్రాంతాలతో పోటీపడి ఈ స్థాయిని సాధించడం అభినందనీయమని తెలిపారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న పోలీస్ కమిషనర్ సునీల్ దత్ మాట్లాడుతూ సమాజంలో వివాదాలను పరస్పర అవగాహన ఒప్పందాల ద్వారా పరిష్కరించుకోవడానికి జాతీయ లోక్ అదాలత్ అత్యంత ప్రాముఖ్యమైన వేదిక అని అన్నారు. లోక్ అదాలత్ ద్వారా కేసులను పరిష్కరించుకోవడం వల్ల బాధితులకు వివాదంలో ఉన్న ఇరువర్గాలకు సమయం డబ్బు ఆదా కావడంతో పాటు చట్టబద్ధమైన శాశ్వత పరిష్కారం లభిస్తుందన్నారు. చిన్న చిన్న వివాదాలను ఇరుపక్షాలు కూర్చుని మాట్లాడుకోవడం వల్ల న్యాయస్థానాలపై కేసుల భారం తగ్గుతుందని తెలిపారు.పోలీసు శాఖ బార్ కౌన్సిల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్లు న్యాయధికారులు సమన్వయంతో పనిచేసి లోక్ అదాలత్ ద్వారా గరిష్ట సంఖ్యలో కేసులు పరిష్కారమయ్యేలా చూడాలని అన్నారు. గత లోక్ అదాలత్‌లో దాదాపు 5,800 కేసులు పరిష్కారం కాగా ప్రస్తుతం 7,800 కేసులు సిద్ధంగా ఉన్నాయని ఈ సంఖ్యను 10,000 దాటించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని పోలీస్ కమిషనర్ వెల్లడించారు. ప్రజలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని, తమ వివాదాలను స్నేహపూర్వక వాతావరణంలో పరిష్కరించుకోవాలని అన్నారు.ఈ సందర్భంగా లోక్ అదాలత్ లో పరిష్కారం అయిన కేసులకు సంబంధించి చెక్కులను ప్రధాన న్యాయమూర్తి అందజేశారు.ఈ కార్యక్రమంలో మహిళా కోర్ట్ న్యాయమూర్తి వి శీనయ్య ఎస్సీ ఎస్టీ కోర్ట్ న్యాయమూర్తి పిపి కృష్ణార్జున్ కుటుంబ న్యాయస్థానం న్యాయమూర్తి మహేష్ నాథ్ బార్ కౌన్సిల్ సభ్యులు ఎం శ్రీనివాస రావు బార్ అసోసియేషన్ అధ్యక్షులు యద్దపల్లి రమేష్ జిల్లా న్యాయసేవా సంస్థ కార్యదర్శి దేవీ మానస న్యాయమూర్తులు కల్పన శివరంజని మురళీమోహన్ జ్యోతిర్మయి రజని బిందుప్రియ ప్రవీణ్ నాగలక్ష్మి పబ్లిక్ ప్రాసిక్యూటర్లు ప్యానెల్ అడ్వకేట్లు వివిధ శాఖల అధికారులు బ్యాంకింగ్/ఇన్సూరెన్స్ ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

## 70వ ఎస్ జి ఎఫ్ క్రీడా పోటీల్లో

# పులిగిల్ల విద్యార్థుల విజయం

**వాలీబాల్, కబడ్డీలో ప్రథమ బహుమతులు**

**జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక**



వలిగొండ /అక్షిత న్యూస్: 70వ ఎస్ జి ఎఫ్ (స్కూల్ గేమ్స్ ఫెడరేషన్) వలిగొండ మండల స్థాయి క్రీడా పోటీల్లో జిల్లా పరిషత్ హై స్కూల్ పులిగిల్ల విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచి ఘన విజయాన్ని సాధించారు. అండర్--14 బాలుర విభాగంలో నిర్వహించిన వాలీబాల్, కబడ్డీ పోటీల్లో ప్రథమ స్థానాలు సాధించి, రెండు విభాగాల్లోనూ జిల్లా స్థాయి క్రీడా పోటీలకు ఎంపికయ్యారు.వాలీబాల్ పోటీల్లో ప్రత్యర్థి జట్లపై సమర్థవంతమైన ఆటతీరును ప్రదర్శించిన పులిగిల్ల విద్యార్థులు ప్రథమ బహుమతి సాధించగా, కబడ్డీ పోటీల్లోనూ అత్యుత్తమ ప్రతిభ కనబరిచి ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకున్నారు. ఒకే క్రీడా వేదికపై రెండు ప్రధాన క్రీడాంశాల్లో ప్రథమ బహుమతులు సాధించడం పాఠశాలకు ప్రత్యేక గర్వకారణంగా నిలిచింది.ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మొకరాల మాధవి మాట్లాడుతూ విద్యార్థుల విజయానికి వారి క్రమశిక్షణ,నిరంతర సాధన, జట్టు సమన్వయం,పట్టుదల ప్రధాన కారణమని తెలుపుతూ, విద్యార్థులకు క్రీడ శిక్షణ,మెలకువలు అందిస్తూ, వారిని పోటీలకు సన్నద్ధం చేసిన పి ఈ టి డా.బోనాల మహేశ్ కృషిని అభినందించారు.ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు విజేతలకు అభినందనలు తెలిపారు. జిల్లా స్థాయి పోటీల్లో కూడా ఇదే స్ఫూర్తితో రాణించి పులిగిల్ల పాఠశాలకు,వలిగొండ మండలానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.


## రామన్నపేటలో అంతర్‌రాష్ట్ర దొంగల ముఠా అరెస్ట్




రామన్నపేట అక్షిత ప్రతినిధి: ఆర్టీసీ బస్సులలో ప్రయాణికులను లక్ష్యంగా చేసుకుని నిత్యం దొంగతనాలకు పాల్పడుతున్న ఒక అంతర్‌రాష్ట్ర దొంగల ముఠాను రామన్నపేట పోలీసులు చాకచక్యంగా అరెస్ట్ చేశారు.ఎస్ఐ గోపాతి సతీష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ ఆపరేషన్‌లో నలుగురు నిందితులను అదుపులోకి తీసుకుని,వారి వద్ద నుంచి బంగారు ఆభరణాలు, కారును స్వాధీనం చేసుకున్నారు.ఈ ముఠాకు చెందిన నలుగురు చీరాల, బాపట్ల జిల్లాకు చెందిన కావడి అలివేలు(45),కర్రెద్దుల మరియమ్మ(33),చౌట భానుప్రసాద్ (24),హైదరాబాద్,హయత్ నగర్ కు చెందిన కావడి మహంకాళి అలియాస్ లక్ష్మి(39)అనే నిందితులను పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.నిందితుల నుంచి పోలీసులు 32.5 గ్రాముల బంగారు పుస్తెలతాడు,(చౌటుప్పల్ పి.ఎస్ సి ఆర్ నం. 504/2026 కి సంబంధించింది) 40 గ్రాముల బంగారు ఆభరణాలు,నేరానికి ఉపయోగించిన ఏపీ 40 జేఎక్స్ 6438 నంబరు గల స్విఫ్ట్ డిజైర్ కారు,2 సెల్‌ఫోన్లు అదుపులోకి తీసుకున్నారు.ఈ అంతర్‌రాష్ట్ర దొంగల ముఠాను ఛేదించడంలో ప్రతిభ కనబరిచిన ఎస్సై గోపాతి సతీష్,ఆయన పోలీసు బృందాన్ని సర్వత్రా అభినందించారు.ఈ సందర్భంగా సీఐ మొగులూరి రవి స్వయంగా ఎస్సై బృందాన్ని అభినందించి,వారికి తగిన రివార్డును అందజేశారు. ప్రయాణికులు రద్దీ సమయాల్లో బస్సులలో తస్కరుల పట్ల అప్రమత్తంగా ఉండాలని పోలీసులు ఈ సందర్భంగా సూచించారు.

## సీజనల్ వ్యాధుల నివారణకు ప్రత్యేక పారిశుద్ధ్య చర్యలు

**నారాయణగూడెంలో బ్లీచింగ్ పౌడర్ చల్లిన గ్రామపంచాయతీ సిబ్బంది**



అక్షిత న్యూస్ మునగాల: గ్రామంలో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమంలో భాగంగా గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో శనివారం బ్లీచింగ్ పౌడర్ చల్లే కార్యక్రమాన్ని నిర్వహించారు వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్న నేపథ్యంలో ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా గ్రామంలోని పలు ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులు చేపట్టారు

గ్రామంలోని ప్రధాన వీధులు వివిధ కాలనీలు, మురుగు నీరు నిలిచే ప్రాంతాలు, ప్రజలు అధికంగా సంచరించే ప్రదేశాలు తదితర ప్రాంతాల్లో బ్లీచింగ్ పౌడర్‌ను చల్లారుమురుగు నీటి కారణంగా దోమలు, ఇతర కీటకాలు వృద్ధి చెందకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేందుకు ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు గ్రామపంచాయతీ అధికారులు తెలిపారు

ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ మాట్లాడుతూ గ్రామాన్ని పరిశుభ్రంగా ఆరోగ్యకరంగా ఉంచడమే గ్రామపంచాయతీ ప్రధాన లక్ష్యమని అన్నారు. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని పారిశుద్ధ్య కార్యక్రమాలను నిరంతరం కొనసాగిస్తున్నట్లు తెలిపారు. వర్షాకాలంలో నీరు నిలిచే ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించి, వ్యాధుల వ్యాప్తికి అవకాశం లేకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు

ప్రజలు కూడా గ్రామపంచాయతీకి సహకరిస్తూ తమ ఇళ్ల పరిసరాల్లో చెత్తాచెదారం పేరుకుపోకుండా చూసుకోవాలని, మురుగు నీరు నిల్వ ఉండకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సర్పంచ్ సూచించారు. పరిశుభ్రమైన వాతావరణం ద్వారా అనేక రకాల వ్యాధులను నివారించవచ్చని, అందుకు ప్రజల భాగస్వామ్యం ఎంతో అవసరమని తెలిపారు.

గ్రామంలో పారిశుద్ధ్య పరిస్థితులను మెరుగుపరిచేందుకు అవసరమైన చర్యలను దశలవారీగా చేపడుతున్నట్లు గ్రామపంచాయతీ సిబ్బంది తెలిపారు.

## సీతారాం ఏచూరి ఆశయాలను సాధిస్తాం

**సీతారాం ఏచూరి రెండవ వర్ధంతి వేడుకలు...**

**సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బూరుగు కృష్ణారెడ్డి**



**చౌటుప్పల్ /అక్షిత న్యూస్:** చౌటుప్పల సిపిఎం పార్టీ మున్సిపల్ కమిటీ ఆధ్వర్యంలో సిపిఎం పార్టీ మాజీ జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి రెండవ వర్ధంతిని శనివారం స్థానిక కందాల రంగారెడ్డి స్మారక భవనంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బూరుగు కృష్ణారెడ్డి హాజరై ఆయన చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించి మాట్లాడుతూ... సీతారాం ఏచూరి భారత కమ్యూనిస్టు ఉద్యమంలో ఒక గొప్ప నాయకుడని, ప్రజల సమస్యలను లోతుగా అర్థం చేసుకున్న మేధావి అని అన్నారు. విద్యార్థి దశలోనే విద్యార్థుల హక్కుల కోసం పోరాడారు, ఎమర్జెన్సీ కాలంలో ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ కోసం పోరాడి అరెస్ట్ అయిన గొప్ప నాయకుడని అన్నారు. దేశవ్యాప్తంగా కార్మికులు, రైతులు, వ్యవసాయ కార్మికులు, పేదలు, అణగారిన వర్గాలు ఎదుర్కొంటున్న సమస్యలపై ఆయన నిరంతరం గొంతు ఎత్తారని, లౌకికవాదం, ప్రజాస్వామ్యం, రాజ్యాంగ విలువల పరిరక్షణ కోసం ఆయన కృషి చేశారని గుర్తు చేశారు. ఈ సమావేశంలో సిపిఎం పార్టీ మున్సిపల్ కార్యదర్శి గోశిక కరుణాకర్, జిల్లా కమిటీ సభ్యులు ఎండి పాషా, బండారు నరసింహ, బత్తుల దాసు, ఆకుల ధర్మయ్య, ఉస్కాకుల శ్రీను, ఎండి ఖయ్యూం, కందగట్ల ఆనంద్, పర్ని ధర్మ రెడ్డి, సప్పిడి శ్రీనివాస్ రెడ్డి, బావుండ్లపల్లి స్వామి, ఎండి రేష్మ, చికూరు ఈ దయ, రాములు, చంద్రయ్య, పల్లె శివ, పాల్గొన్నారు.

## ఈనెల 27న ఉద్యమకారులు యాదగిరిగుట్టకు తరలిరావాలి

**తెలంగాణ ఉద్యమకారుల జిల్లా అధ్యక్షులు గుండె పంగు రమేష్**



**కోదాడ అక్షిత ప్రతినిధి:** తెలంగాణ ఉద్యమకారుల ఫోరం స్థాపించి తొమ్మిది సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఈ నెల 27న యాదగిరిగుట్టలో నిర్వహించనున్న ఉద్యమకారుల సమావేశాన్ని విజయవంతం చేయాలని ఆ ఫోరం వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ చీమ శ్రీనివాస్ , జిల్లా అధ్యక్షులు గుండె పంగు రమేష్ కోరారు. శనివారం కోదాడ పట్టణంలోని స్థానిక లారీ అసోసియేషన్ కార్యాలయంలో సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు గుండెపంగు రమేష్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో చలో యాదగిరిగుట్ట పోస్టర్‌ను నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్ చీమ శ్రీనివాస్ మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు, సంక్షేమం కొరకు కేకే కమిటీని నియమించినందుకు ప్రభుత్వానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను, వారి సంక్షేమ పథకాలను ప్రభుత్వం త్వరితగతిన అమలు చేసి ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. అలాగే రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని ప్రధాన రాజకీయ పార్టీలు ఉద్యమకారులకు 20 శాతం టికెట్లు కేటాయించి ప్రోత్సహించాలని కోరారు. అనంతరం ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆవుల రామారావు, జిల్లా అధ్యక్షుడు గుండెపంగు రమేష్ మాట్లాడుతూ సూర్యాపేట జిల్లా నుంచి సుమారు 1000 మందికి పైగా ఉద్యమకారులు యాదగిరిగుట్ట సభకు తరలివస్తారని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఉద్యమకారుల ఫోరం నాయకులు, ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర నాయకులు భూపాల్, జగన్ యాదవ్, భాస్కర్, జోగు అంజన్న, కౌన్సిలర్, చీమ. నరేష్,తుపాకుల. భాస్కర్,ఎండి. మజ్హార్, కుక్కడపు బాబు,ఏనుగుల. ఎల్లేశ్వరావు, కోట్లూరి, వెంకటేశ్వర్లు, సైదులు నాయక్, బచ్చు రాజ్యం, బొమ్మ కంటి వీరబాబు,మేకపోతుల. శ్రీను, బెల్లంకొండ వేలాద్రి, ముక్క రాములు, బొంత శివాజీ, ఉడుం కోటేశ్వరరావు,శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# గణేష్ నవరాత్రులను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలి

**డీజేలకు అనుమతులు లేవు**

**నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవు**

**ఎస్సై లింగారెడ్డి**



**నాంపల్లి, అక్షిత న్యూస్:** గణేష్ నవరాత్రి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని ఎస్సై లింగారెడ్డి సూచించారు. ఉత్సవాల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా నిర్వాహకులు పోలీసులకు సహకరించాలని కోరారు. గణేష్ మండపాల నిర్వాహకులు ప్రభుత్వ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని స్పష్టం చేశారు.



ఈ సందర్భంగా మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ ఆవరణలో మండపాల నిర్వాహకులతో ఆయన మాట్లాడుతూ గణేష్ నవరాత్రి ఉత్సవాల పేరుతో నిబంధనలు అతిక్రమిస్తే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. ముఖ్యంగా డీజేలకు ఎలాంటి అనుమతులు లేవని నిబంధనలకు విరుద్ధంగా డీజేలు వినియోగిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. అధిక శబ్దంతో ప్రజలకు వృద్ధులకు చిన్నారులకు ఇబ్బందులు కలిగించే విధంగా వ్యవహరించరాదన్నారు.

గణేష్ మండపాల వద్ద భద్రతా చర్యలు చేపట్టాలని ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని మండపాల నిర్వాహకులు ముందుగానే పోలీసుల సూచనలు పాటించి ఉత్సవాలను సజావుగా నిర్వహించుకోవాల రాత్రివేళల్లో నిబంధనలకు విరుద్ధంగా శబ్ద కాలుష్యం సృష్టించడం అనుమతులు లేని కార్యక్రమాలు నిర్వహించడం ప్రజలకు ఇబ్బందులు కలిగించే చర్యలకు పాల్పడటం వంటి వాటిని తీవ్రంగా పరిగణిస్తామని

భక్తి పేరుతో నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవు అని ఎస్సై లింగారెడ్డి తేల్చిచెప్పారు. గణేష్ ఉత్సవాలు భక్తి సామరస్యానికి ప్రతీకగా నిలవాలని అన్ని వర్గాల ప్రజలు ప్రశాంతంగా పండుగను జరుపుకునేలా నిర్వాహకులు బాధ్యతగా వ్యవహరించాలని

పోలీసుల హెచ్చరికలను ప్రతి గణేష్ మండపం నిర్వాహకుడు పాటించాలని ఆయన స్పష్టం చేశారు.

## విద్యార్థులకు విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు

**శ్రీ గాయత్రీ కళాశాలలో ఘనంగా ఫ్రెషర్స్ పార్టీ**

**కళాశాల చైర్మన్ బండారు మయూర్ రెడ్డి**

**కళాశాల కరస్పాండెంట్ భీమిడి సుభాష్ రెడ్డి**




**చౌటుప్పల్ /అక్షిత న్యూస్:** విద్యార్థులకు విద్యుత్ని ఉజ్వల భవిష్యత్తు ఏర్పడుతుందని శ్రీగాయత్రి కళాశాల చైర్మన్ బండారు మయూరి రెడ్డి అన్నారు. శనివారం శ్రీ గాయత్రీ కళాశాల ఆధ్వర్యంలో విద్యార్థుల కోసం నిర్వహించిన "శ్రీ గాయత్రీయన్ సింఫోనియా ఫ్రెషర్స్ పార్టీ" ని చౌటుప్పల్‌లోని వి.వి.ఆర్.గార్డెన్ లో అంగరంగ వైభవంగా నిర్వహించారు. విద్యార్థినీ,విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని ఆటపాటలు,నృత్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలతో సందడి చేశారు.

ఈ కార్యక్రమానికి శ్రీగాయత్రీ కళాశాల చైర్మన్ బండారు మయూర్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్మన్ బండారు మయూర్ రెడ్డి మాట్లాడుతూ...విద్య ఒక్కటే మనిషి జీవితాన్ని మార్చగలిగే శక్తివంతమైన సాధనం అని అన్నారు. విద్యలో రాణిస్తే గౌరవం, ఆర్థిక స్థిరత్వం, మంచి భవిష్యత్తు వాటంతట అవే వస్తాయని తెలిపారు. నిరుపేద కుటుంబంలో జన్మించిన భారత మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఏ.పి.జె. అబ్దుల్ కలాం విద్యను ఆయుధంగా చేసుకుని దేశ అత్యున్నత స్థాయికి ఎదిగారని, ఆయన జీవితమే విద్య యొక్క గొప్పతనానికి నిదర్శనమని పేర్కొన్నారు. అనంతరం కళాశాల కరస్పాండెంట్ భీమిడి సుభాష్ రెడ్డి విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ.. శ్రీ గాయత్రీ ఎడ్యుకేషనల్ ఇన్స్టిట్యూషన్స్ ఎలాంటి లాభాపేక్ష లేకుండా విద్యపై ఉన్న మమకారంతో కళాశాలలను నిర్వహిస్తూ, విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు నిరంతరం కృషి చేస్తున్నామని తెలిపారు.

విద్యార్థినీ, విద్యార్థులు సంప్రదాయ దుస్తుల్లో హాజరై ఆటపాటలు, నృత్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. ఈ కార్యక్రమంలో శ్రీ గాయత్రీ జూనియర్ కళాశాలల ప్రిన్సిపాల్, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థినీ విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## తెలంగాణ మున్నూరు కాపు జేఏసీ ఖమ్మం జిల్లా అధ్యక్షుడిగా యర్రా అప్పారావు నియామకం



**ఖమ్మం/అక్షిత బ్యూరో :** తెలంగాణ రాష్ట్ర మున్నూరు కాపు జాయింట్ యాక్షన్ కమిటీ ఖమ్మం జిల్లా నూతన అధ్యక్షుడిగా యర్రా అప్పారావు ఏకగ్రీవంగా నియమితులయ్యారు. ఈ మేరకు తెలంగాణ రాష్ట్ర మున్నూరు కాపు జేఏసీ అధ్యక్షులు చందు జనార్దన్ నియామక ఉత్తర్వులు ప్రకటించారు. జిల్లా అధ్యక్షుడిగా యర్రా అప్పారావును ఏకగ్రీవంగా ఎంపిక చేయడం పట్ల మున్నూరు కాపు సామాజిక వర్గానికి చెందిన పలువురు నాయకులు ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు. ఆయన నాయకత్వంలో ఖమ్మం జిల్లాలో మున్నూరు కాపు జేఏసీని మరింత బలోపేతం చేసేందుకు కృషి జరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అదే విధంగా సామాజిక వర్గ ఐక్యత సంక్షేమం హక్కుల పరిరక్షణ ప్రజా సమస్యల పరిష్కారం కోసం జేఏసీ ఆధ్వర్యంలో మరింత విస్తృతంగా కార్యక్రమాలు నిర్వహించాల్సిన అవసరం ఉందని నాయకులు పేర్కొన్నారు. జిల్లాలోని మున్నూరు కాపు సమాజాన్ని సంఘటితం చేస్తూ వారి సమస్యలను సంబంధిత ప్రభుత్వ యంత్రాంగం దృష్టికి తీసుకెళ్లడంలో నూతన జిల్లా అధ్యక్షుడు కీలకంగా వ్యవహరించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా యర్రా అప్పారావుకు పలువురు నాయకులు అభిమానులు మున్నూరు కాపు జేఏసీ ప్రతినిధులు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. తనను ఖమ్మం జిల్లా అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా నియమించిన తెలంగాణ రాష్ట్ర మున్నూరు కాపు జేఏసీ అధ్యక్షులు చందు జనార్దన్ కు యర్రా అప్పారావు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు . తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ జిల్లాలో జేఏసీని మరింత బలోపేతం చేయడానికి మున్నూరు కాపు సామాజిక వర్గం అభివృద్ధి కోసం శక్తివంచన లేకుండా కృషి చేస్తానని అన్నారు.